RNI Regd. No. TELTEL/2023/86207

# గరుడ వార్త

తెలుగు దినపత్రిక

www.garudavarthanews.com
www.garudavarthanews.in

సంపుటి : 2 సంచిక : 231 మేడ్చల్ మల్కాజ్‌గిరి 12 సెప్టెంబర్ 2024 గురువారం పేజీలు : 4

## ప్రపంచంలో ఉత్తమ దేశం స్విట్జర్లాండ్

న్యూఢిల్లీ : ప్రపంచంలో ఉత్తమ దేశంగా స్విట్జర్లాండ్ ఎంపికయింది. యూఎస్ న్యూస్ అండ్ వరల్డ్ రిపోర్ట్ సంస్థ 2024 సంవత్సరానికి నిర్వహించిన ఉత్తమ దేశాల ర్యాంకింగ్‌ల్లో ఈ స్థానం లభించింది. ఉత్తమ దేశంగా స్విట్జర్లాండ్ ఎంపిక కావడం వరుసగా ఇది మూడోసారి కావడం విశేషం. ఆ తరువాతి స్థానాల్లో జపాన్, అమెరికా, కెనడా, ఆస్ట్రేలియాలు ఉన్నాయి. భారత్‌కు 33వ స్థానం దక్కింది. గత ఏడాదితో పోల్చితే మూడు ర్యాంకులు తగ్గాయి. మొత్తం 89 దేశాల్లో సర్వే జరిపి ర్యాంకులు ఇచ్చారు. జీవన ప్రమాణాలు, సాహసాలు, వారసత్వం, వ్యాపార దక్షత, సాంస్కృతిక ప్రయోజనం తదితర పది అంశాలను పరిగణనలోకి తీసుకుని ప్రజాభిప్రాయం సేకరించారు. స్విట్జర్లాండ్‌లో జీవన నాణ్యత, వాణిజ్యంలో పారదర్శకత బాగున్నట్టు తేలింది. భారత్ విషయానికి వస్తే 'మూవర్స్', 'వారసత్వం' అంశాల్లో మార్కులు వచ్చాయి. ఇతర ప్రాంతాలకు వెళ్లి అక్కడి పరిస్థితులకు త్వరగా అలవాటు పడేవారిని 'మూవర్స్'గా నిర్వచించారు.

# తెలంగాణ కేబినెట్ విస్తరణకు వేళాయే?

## హస్తిన బయలెల్లిన సీఎం రేవంత్‌రెడ్డి

## నేడు ఓ కొలిక్కి వచ్చే అవకాశం




హైదరాబాద్: తెలంగాణ రాజకీయ వర్గాలు ఎప్పుడెప్పుడూ అని ఎదురుచూస్తున్న కేబినెట్ విస్తరణ త్వరలోనే జరగబోతోందా?. త్వరలోనే ఈ ప్రక్రియ షురూ కానుందా? ఈ మేరకు ముహూర్తం ఖరారైందా? అనే సందేహాలకు ఔననే సమాధానం వస్తోంది.

సీఎం రేవంత్ రెడ్డి ఇవాళ ఢిల్లీకి వెళ్లనున్న నేపథ్యంలో ఈ ఊహాగానాలు మరింత జోరందుకున్నాయి. తెలంగాణ మంత్రివర్గ విస్తరణ కసరత్తు మొదలైందా అనే చర్చ జోరుగా నడుస్తోంది. రేపు సాయంత్రం కాంగ్రెస్ అధిష్టానంలో రేవంత్ రెడ్డి చర్చలు జరుపుతారని తెలుస్తోంది. మంత్రివర్గ విస్తరణకు హైకమాండ్ గ్రీన్ సిగ్నల్ ఇచ్చే అవకాశం ఉందని సమాచారం. నామినేటెడ్, ఎమ్మెల్సీ స్థానాల భర్తీ, పీసీసీ చీఫ్ నియామకం పూర్తవ్వడంతో ప్రస్తుతం అందరి దృష్టి మంత్రివర్గ విస్తరణపైనే పడింది.

డిసెంబర్ 7న సీఎం రేవంత్ రెడ్డితో పాటు 11 మంది మంత్రులుగా ప్రమాణ స్వీకారం చేశారు. దీంతో 6 కేబినెట్ బెర్తులు ఖాళీగా ఉన్నాయి. హోం మంత్రిత్వశాఖ, మున్సిపల్, విద్య, మైనింగ్‌తో పాటు పలు కీలక శాఖలు సీఎం వద్దే ఉన్నాయి. కాగా కేబినెట్‌లో చోటు కోసం పలువురు సీనియర్ల ప్రయత్నాలు చేస్తున్నారు.

**రేసులో ఉన్నది ఎవరు? :** తెలంగాణ కేబినెట్ విస్తరణలో పలువురు సీనియర్ మంత్రి పదవులు ఆశిస్తున్నరు. రేసులో ఉన్న నేతల విషయానికి వస్తే ఆదిలాబాద్ నుంచి గడ్డెం బ్రదర్స్, మంచిర్యాల నుంచి ఎమ్మెల్యే ప్రేమ్ సాగర్ రావు, నిజామాబాద్ జిల్లా నుంచి బోధన్ ఎమ్మెల్యే సుదర్శన్ రెడ్డి, రంగారెడ్డి జిల్లా నుంచి మల్ రెడ్డి రంగారెడ్డి, తాండూర్ ఎమ్మెల్యే రాంమోహన్ రెడ్డి ఉన్నారు.

వీరితో పాటు నల్గొండ జిల్లా నుండి కోమటిరెడ్డి రాజగోపాల్ రెడ్డి, మహబూబ్ నగర్ నుంచి మక్తల్ ఎమ్మెల్యే శ్రీహరి ముదిరాజ్, మైనార్టీ కోటాలో షబ్బీర్ అలీ, అజారుద్దీన్ అమాత్య పదవులను ఆశిస్తున్నరు. మరి వీరిలో ఎవరిని పదవులు వరించనున్నాయి?, అనూహ్యంగా ఇంకెవరైనా రేసులోకి వచ్చి పదవులు దక్కించుకుంటారా? అనేది చూడాల్సి ఉంది.

మరోవైపు ఢిల్లీ పర్యటనలో భాగంగా సీఎం రేవంత్ రెడ్డి కేంద్ర హోం మంత్రి అమిత్ షాతో రేపు (గురువారం) భేటీ కానున్నారు. వరద నష్టం అంచనా వివరాలు చెప్పి కేంద్ర సాయం కోరనున్నారు.

# ఈ ఏడాది పూర్తి అయ్యేలోపు మరో 35 వేల ఉద్యోగాలు

## ఎస్సైల పాసింగ్ అవుడ్ పరేడ్‌లో సీఎం కీలక ప్రకటన

హైదరాబాద్, సెప్టెంబర్ 11: ప్రభుత్వ ఉద్యోగాలపై ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి మరో కీలక ప్రకటన చేశారు. ఈ ఏడాది పూర్తి అయ్యేలోపు మరో 35 వేల ఉద్యోగాలు ఇవ్వాలని ప్రజాపాలన ప్రభుత్వం నిర్ణయం తీసుకుందని ప్రకటించారు. ప్రజా ప్రభుత్వం ఏర్పాటు అయిన రెండు నెలల్లోనే 30వేల పైచిలుకు ఉద్యోగాలను భర్తీ చేశామని గుర్తుచేశారు. బుధవారం తెలంగాణ అకాడమీలో ఎస్సైల పాసింగ్ అవుడ్ పరేడ్‌కు సీఎం రేవంత్ రెడ్డి ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా పోలీసుల గౌరవవందనం స్వీకరించారు. అనంతరం ముఖ్యమంత్రి మాట్లాడుతూ... "శిక్షణ పూర్తి చేసుకున్న ఎస్ఐలకు మనస్పూర్తిగా శుభాకాంక్షలు తెలియజేస్తున్నాను.. ఈ సన్నివేశం మీతో పాటు నాకు కూడా మధుర జ్ఞాపకం" అని అన్నారు. తెలంగాణ సాధించుకున్న తరువాత విద్యార్థుల్లో, ఉద్యమకారుల్లో , ప్రజల్లో ఎంతో అసంతృప్తిగా ఉందని.. ప్రజా ప్రభుత్వం ఏర్పాటు తరువాత నిరుద్యోగులకు ఉద్యోగాలు కల్పించామని తెలిపారు. తెలంగాణ పబ్లిక్ సర్వీస్ కమిషన్‌ను కొత్తగా నియమించి ఉద్యోగాలు భర్తీ చేస్తున్నామన్నారు. తెలంగాణలో అవలక్షణాలతో డ్రగ్స్ బానిసలయ్యారన్నారు. గంజాయి, డ్రగ్స్‌పై ఉక్కుపాదం మోపుతున్నామన్నారు. "పోలీస్ ఉంటే ఉద్యోగం కాదు.. ఇది ఎమోషన్ , బాగోద్వేగం.. డ్రగ్స్ , గంజాయి, సైబర్ క్రైమ్‌పై మీరు బలంగా పని చేస్తారని మీ పై పూర్తి విశ్వాసం ఉంది" అని చెప్పుకొచ్చారు. తెలంగాణాలో పెట్టుబడులు తీసుకురావడంతో పాటు ప్రజల కుల వృత్తులను ఆదుకుంటూ ప్రభుత్వం ముందుకు వెళ్తోందన్నారు.

దేశ చరిత్రలోనే 18 వేల కోట్లు రూపాయలు కడుపు కట్టుకొని రైతుల అకౌంట్లలో జమ చేశామని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి పేర్కొన్నారు.




**547 సబ్ ఇన్స్‌పెక్టర్ల పాసింగ్ అవుట్ పరేడ్ :** తెలంగాణ పోలీస్ అకాడేమి నుండి ఈరోజు 547 సబ్ ఇన్స్‌పెక్టర్లు పాసింగ్ అవుట్ పరేడ్ నిర్వహించారు. ట్రైనింగ్ పూర్తి చేసుకున్న వారిలో 145 మంది మహిళా ఎస్ఐలు, 402 మంది పురుషులు ఉన్నారు. 547 లో 401 మంది సివిల్ ఎస్ఐలు ఉన్నారు. అలాగే 547లో 472 మంది గ్రాడ్యూయేట్స్, 75 మంది పోస్ట్ గ్రాడ్యూయేట్స్ ఉన్నారు. వీరిలో 248 మంది ఎస్ఐలకు బీ టెక్ బ్యాక్ గ్రౌండ్ ఉంది. పరేడ్ కమాండర్‌గా మహిళా ఎస్ఐ పల్లి బాగ్యశ్రీ వ్యవహరించారు. ట్రైనింగ్ పూర్తిచేసుకున్న వారిలో అత్యధికంగా 26 నుంచి ముప్పై వయసు గల అభ్యర్థులు ఉన్నారు. 283 మంది 26 నుంచి 30 సంవత్సరాల వయసు కలవారు శిక్షణ పొందారు. అలాగే 182 మంది 25 ఏళ్ళ లోపు వయసున్నవారు సబ్ ఇన్స్‌పెక్టర్లుగా శిక్షణ పొందారు.




## క్రమంగా పెరుగుతోన్న గోదావరి ఉధృతి.. డేంజర్ జోన్‌లో భద్రాచలం

ఉమ్మడి ఖమ్మం జిల్లాతో పాటు ఎగువన కురుస్తున్న భారీ వర్షాల కారణంగా భద్రచలంలోని గోదావరి ఉధృతంగా ప్రవహిస్తోంది. ఈ క్రమంలోనే క్రమక్రమంగా నీటి మట్టం పెరుగుతూనే ఉందని అధికారులు వెల్లడించారు. తాజాగా, బుధవారం ఉదయానికి గోదావరి నీటి మట్టం 50.5 అడుగుల వద్ద కొనసాగుతోంది. 48 అడుగులు మేర నీటి మట్టం చేరిన అనంతరం అధికారులు రెండో ప్రమాద హెచ్చరిక జారీ చేశారు. అదేవిధంగా పరిస్థితి ఇలానే కొనసాగితే.. నీటి మట్టం 53 అడుగులు దాటిన పక్షంలో మూడో ప్రమాద హెచ్చరిక జారీ చేయనున్నట్లు అధికారులు వెల్లడించారు. కాగా, 1986లో భద్రాచలంలో వద్ద అత్యధిక వరద నమోదైంది. నదిలో నీటి మట్టం 75.60 అడుగులకు చేరింది. ఆ సమయంలో 27 లక్షల క్యూసెక్కుల నీరు గోదావరిలో ప్రవహించింది. 2022 వరదల్లో ప్రవాహం 71.30 అడుగులుగా నమోదు కాగా, 21.78 లక్షల క్యూసెక్కుల నీరు దిగువకు విడిచి పెట్టారు. ప్రస్తుతం ఆ స్థాయిలో ప్రమాదం లేకపోయినా అధికార యంత్రాంగం ముందు జాగ్రత్త చర్యల్లో నిమగ్నమైంది. ఉన్నతాధికారులు ఎప్పటికప్పుడు పరిస్థితిని సమీక్షిస్తు లోతట్టు ప్రాంతాలను అప్రమత్తం చేస్తున్నారు.



# ఏమిటీ విధి వైపరీత్యం!?

## భారతావనిపై ప్రకృతి పగబట్టిందా?

## తాజా రిపోర్టులో షాకిచ్చే అంశాలు!!

మన దేశాన్ని ప్రకృతి పగబట్టిందా? మనం చేసే తప్పులకు ప్రకృతి శిక్షలు వేస్తుందా? ఇటీవల కాలంలో రోజుల తరబడి ముసురేయటం.. వాగుల్ని.. వంకల్ని ఏకం చేసేలా భారీ వర్షాలు.. గంటల వ్యవధిలో కురిసే కుంభవ్రష్టి. దీంతో.. మునిగిపోయే పట్టణాలు.. నగరాలు. ఇవన్నీ చాలావన్నట్లు మండే ఎండలు.. గజ గజ వణికేలా చలి. ఏది చూసినా.. అసాధారణంగా వ్యవహరిస్తున్న తీరుపై జరిపిన అధ్యయనం షాకింగ్ అంశాల్ని వెల్లడించింది. ఇటీవల కాలంలో పెరిగిన కరవు కాటకాలు.. విపత్తులపై ఐపీఈ గ్లోబల్.. ఈఎస్ఆర్ ఐ ఇండియా తాజా అధ్యయనాన్ని వెల్లడించింది. – 1973 – 2023 మధ్య ఐదు దశాబ్దాల్లో నమోదైన అసాధారణ ప్రకృతి విపత్తులను విశ్లేషించారు. దీన్ని ఢిల్లీలో నిర్వహిస్తున్న క్లైమేట్ టెక్నాలజీ సదస్సులో ఆవిష్కరించారు. ఏపీ.. తమిళనాడు..కర్ణాటక లాంటి రాష్ట్రాల్లో కరువు పరిస్థితులు నానాటికీ పెరుగుతున్నట్లుగా పేర్కొంది. దేశంలోని 85 శాతం జిల్లాల్లో అసాధారణ విపత్తులు నెలకొన్నాయని.. ఐదు దశాబ్దాల్లో వీటి తీవ్రత నాలుగు రెట్లు పెరిగినట్లుగా పేర్కొన్నారు. 45 జిల్లాల్లో కరువు నేలల్లో వరదలతో అతలాకుతలం అవుతున్నట్లుగా పేర్కొన్నారు. పర్యావరణంలో వస్తున్న అసాధారణ మార్పులతో విపత్తులు సైతం అసాధారణ స్థాయిలో విరుచుకుపడి ప్రజల్ని ఇబ్బంది పెడుతున్నాయని వెల్లడించారు. బిహార్.. ఏపీ.. ఒడిశా.. గుజరాత్.. రాజస్థాన్.. ఉత్తరాఖండ్.. హిమాచల్ ప్రదేశ్.. మహారాష్ట్ర.. ఉత్తరప్రదేశ్.. అసోం రాష్ట్రాల్లోని 60 శాతానికి పైగా జిల్లాలు కనీసం ఏడాదికి ఒక్క అసాధారణ ప్రకృతి ఉత్పాతాన్ని చవిచూస్తున్నట్లుగా పేర్కొన్నారు. విపత్తులు మామూలుగానే భయంకరంగా ఉంటాయి. వాతారణ మార్పుల కారణంగా.. విపత్తులు అసాధారణంగా విరుచుకుపడుతూ ప్రజల్ని తీవ్రంగా ఇబ్బందులకు గురి చేస్తున్నాయని వెల్లడైంది. గడిచిన యాభై ఏళ్లలో ఇలాంటి అసాధారణ విపత్తుల ఫ్రీక్వెన్సీ.. ఇంటెన్సిటీ.. అన్ ప్రెడిక్టబిలిటీలు నాలుగు రెట్లు పెరిగాయి. గడిచిన పదేళ్లలో ఈ తీరు ఏకంగా ఐదు రెట్లు ఎక్కువగా ఉన్నట్లుగా గుర్తించారు. 45 జిల్లాల్లో కరువు నేలలను వరదలు ముంచేస్తున్నట్లుగా గుర్తించిన అధ్యయనం.. వరదలు ఎక్కువగా వచ్చే ప్రాంతాల్లో కరువుకాటకాలు విలయతాండవం చేస్తున్నాయని పేర్కొన్నారు.

**ఈ రిపోర్టులో పేర్కొన్న మిగిలిన ముఖ్యాంశాల్ని చూస్తే..** – ఈ పరిస్థితులకు మనుషులే కారణం. – ప్రకృతిలోని మిగిలిన జీవుల్ని పట్టించుకోకుండా మనుషులు చేపట్టే కార్యకలాపాలే ఈ అసాధారణ విపత్తులకు కారణం. – పెరిగిన కర్బన ఉద్గారాలు.. పద్దతి లేని ల్యాండ్ స్కేప్ ప్లానింగ్.. ప్రకృతిలోని మిగిలిన జీవుల్ని పట్టించుకోకపోవటం. – దేశంలోని తూర్పు ప్రాంత జిల్లాలు అసాధారణ వరదల బారిన పడే ముప్పు ఎక్కువ.

**– వరదప్రాంతాల నుంచి కరువు ప్రాంతాలుగా మారిన జిల్లాలో తెలుగు రాష్ట్రాలకు సంబంధించి..** 1. మహబూబ్ నగర్, 2. నల్గొండ, 3. శ్రీకాకుళం, 4. గుంటూరు, 5. కర్నూలు

**మరి మన ముందున్న మార్గం ఏంటి?...** అన్నింటికంటే ముందు క్లైమేట్ రిస్క్ అబ్జర్వేటరీని ఏర్పాటు చేయటం ద్వారా భవిష్యత్తు ముప్పులను ముందే అంచనా వేసి.. ఆ మేరకు జాతీయ.. రాష్ట్ర.. జిల్లా.. నగర స్థాయిల్లోనిర్ణయాలు తీసుకునే వ్యవస్థ. ఒక ఫండ్ ఏర్పాటు చేసి.. పర్యావరణ మార్పులకు ఎక్కువగా ప్రభావితం కాని కీలక మౌలిక వసతులను కల్పించాలి.

నిజానికి అంతర్జాతీయ సగటుతో పోలిస్తే మన దేశంలో తలసరి కర్బన్ ఉద్గారాల విడుదల మూడో వంతు మాత్రమే. అమెరికా.. చైనాతో పోలిస్తే పిసరంత మాత్రమే. అయినా.. పర్యావరణ మార్పుల ప్రభావానికి ఎక్కువ ప్రభావితం అవుతున్నది మన దేశమే. పర్యావరణ మార్పులను ఎదుర్కొనేందుకు ఇప్పటివరకు మనం కర్బన్ ఉద్గారాలను తగ్గించుకునే ప్రయత్నాల్ని చేస్తున్నామని.. దానికి బదులుగా ప్రతి ఒక్కరూ పర్యావరణాన్ని పరిరక్షించేలా నడుచుకునే విధానాన్ని రూపొందించాల్సి ఉంది. మొక్కలు నాటటం.. చెట్లు నరకకుండా ఉండటం.. ఏసీల వాడకంఅవసరం లేకుండా సహజంగా ఇళ్లు.. ఆఫీసులను చల్లగా ఉంచేలా నిర్మాణాల్ని చేపట్టటం లాంటివి చేయాలి. ఈ అధ్యయనంలోని అంచనా ప్రకారం 2036 నాటికి 147 కోట్ల మంది భారతీయులు అసాధారణ ప్రకృతి విపత్తుల బారిన పడనున్నట్లుగా హెచ్చరించటం గమనార్హం.

# సంపాదకీయం

## విదేశాలకు వెళ్లి దేశాన్ని తక్కువ చేసి.. ఇతరుల్ని పొగడటమేంది రాహుల్?

వయసు మీదకు వచ్చిన తర్వాత కూడా మెజార్టీ భారతీయులు ఏం కోరుకుంటున్నారు? వారి వేదన.. ఆవేదన ఏమిటి? వారి ఆశల్ని వినాలన్న ఆలోచన కాంగ్రెస్ ముఖ్యనాయకుడు రాహుల్ గాంధీకి రాదా? అన్నదిప్పుడు ప్రశ్నగా మారింది. ఇంట్లో పంచాయితీ ఉంటే ఇంట్లో కూర్చొని తేల్చుకోవాలి. లేదంటే.. ఇంటి బంధువుల్ని ఇంటికి పిలిపించి మాట్లాడాలి సెటిల్ చేయాలి. అంతేకాదు.. ఊళ్లోకి వెళ్లి ఇంటిని నోటికి వచ్చినట్లుగా మాట్లాడితే ప్రయోజనం ఉంటుందా? దాని కారణంగా లాభం సంగతేమో కానీ నష్టమే ఎక్కువన్న విషయం చిన్నపిల్లాడికి కూడా అర్థమవుతుంది. మరి.. ఈ విషయం రాహుల్ కు ఎందుకు అర్థం కానట్లు? అన్నది ప్రశ్న. తాజాగా అమెరికాలో పర్యటిస్తున్న రాహుల్ గాంధీ.. ఎప్పటిలానే మోడీ సర్కారుపై విమర్శలు సంధించారు. అదే సమయంలో అమెరికా.. చైనా అంటూ చాలానే మాటలు చెప్పారు. తెలుగును ప్రస్తావిస్తూ.. ఆయన కొన్ని ఉదాహరణలు చెప్పారు. ఆయన తీరులోనే ఆలోచిస్తే.. మన దేశానికి వచ్చే అమెరికా అధ్యక్షుడు కానీ.. చైనా అధినేత కానీ ఎప్పుడైనా తమ దేశంలోని రాజకీయాలను.. అక్కడి పొలిటికల్ పంచాయితీలను భారత్ లో పర్యటించే వేళలో ప్రస్తావిస్తారా? అన్నది చూస్తే.. సమాధానం ఇట్టే వచ్చేస్తుంది. నిద్ర లేచింది మొదలు వారే స్ఫూర్తిదాతలు అని చెప్పే రాహుల్.. మరి.. వారి తీరును ఎందుకు ఫాలో కారు? అన్నది సందేహంగా మారింది. **తన అమెరికా పర్యటనలో ఎన్ ఆర్ ఐలతో భేటీ అయిన ఆయన ప్రసంగించారు. ఇందులో కొన్ని కీలక వ్యాఖ్యల్ని చూస్తే..** – భారత రాజకీయాల్లో ప్రేమ.. గౌరవ మర్యాదలు.. మానవత్వం లోపించాయి – మేం మాత్రం కుల, మత, సంస్కృతి, చరిత్ర అనే తేడాల్లేకుండా ప్రతి ఒక్కరికి సమానావకాశాలు కల్పించేలా ప్రయత్నిస్తున్నాం. – ఆర్ఎస్ఎస్ భారత్ ను ఒక భావజాలంగా భావిస్తుంది. మహిళల్ని ఇంటికే పరిమితం కావాలనే ధోరణి ఉంటుంది. – అమెరికా మాదిరి మేం కూడా ప్రతి ఒక్కరికీ భాగస్వామ్యం కల్పించాలని కోరుకుంటాం. – భారత ఎన్నికల ఫలితాలు వచ్చిన కొద్ది క్షణాల్లోనే ప్రజలు బీజేపీకి.. మోడీకి భయపడటం మానేశారు – ఇది రాజ్యాంగాన్ని అర్థం చేసుకున్న ప్రజలు సాధించిన భారీ విజయం – అన్ని ప్రాంతాల భాషలను.. సంస్కృతులను గౌరవించాలి. అన్ని కులాలను గౌరవించాలి – ఏకలవ్యుడి ఉదంతాన్ని ఉటంకిస్తూ.. నైపుణ్యత ఉన్న వారిని పాలకులు గౌరవించటం లేదు. – భారత్.. అమెరికా మధ్య స్వేచ్ఛాయుత రాకపోకలు ఉండదలన్నదే ఆకాంక్ష – చైనాతో పోలిస్తే భారత్ లో నిరుద్యోగం ఎక్కువ – భారత్ సహా ప్రాశ్చాత్య దేశాలు తమ ఉత్పత్తిని మానేసి.. ఆ పని చైనాకు అప్పజెప్పాయి. – భారత జాతీయ గీతం అన్ని రాష్ట్రాలను ప్రతిబింబిస్తుంది. అన్ని రాష్ట్రాల్ని సమానంగాచూపిస్తుంది. – ఏ రాష్ట్రం ఎక్కువా కాదు.. తక్కువా కాదు. – తెలుగు కేవలం భాషగా మాత్రమే కాకుండా చరిత్ర.. సంప్రదాయం.. సంస్కృతిగా చూస్తాం. – హిందీతో పోలిస్తే తెలుగు భాష అంత ముఖ్యం కాదని ఒక వేళ ఆ రాష్ట్ర ప్రజలకుచెబితే అది వారిని అవమానించినట్లే. – ఈ చిన్న తేడాను కొందరు అర్థం చేసుకోవటం లేదు. రాహుల్ వ్యాఖ్యలనే తీసుకొని కొన్ని ప్రశ్నలు సంధిస్తే.. ఆయన మాటల్లోని డొల్లతనం ఇట్టే అర్థమవుతంది.

1. రాష్ట్రాలను సమంగా చూస్తామన్న చిలకపలుకులు పలికే రాహుల్.. తెలంగాణ రాష్ట్ర ఏర్పాటు వేళ చేసిందేంటి? 2. అందరిని సమంగా చూస్తామని చెప్పే ఆయన.. విభజన వేళలో ఇరు ప్రాంతాల వారికి సమంగా న్యాయం చేయలేదేం? 3. చైనాకు ఉత్పత్తి అవకాశం ఇచ్చామని చెబుతున్నారు. పదేళ్లుగా మోడీ ప్రభుత్వం కొలువు తీరి ఉంది. అంతకు ముందంతా కాంగ్రెస్సే ఏలింది కదా? అప్పుడెందుకు చేయనట్లు? 4. చైనాతో పోలిస్తే భారత్ లో నిరుద్యోగం ఎక్కువన్నదే పాయింట్ అయితే.. 2004–2014 మధ్యలో ఉన్న నిరుద్యోగంతో పోలిస్తే గడిచిన పదేళ్లలో పెరిగిందా? 5. భారత రాజకీయాల్లో ప్రేమ.. అభిమానాలు తగ్గాయంటున్నారు. ఇప్పుడు మీరున్న అమెరికాలో జరుగుతున్న అధ్యక్ష ఎన్నికల్లో ఇద్దరు అభ్యర్థులు చేసుకుంటున్న విమర్శలు.. వ్యాఖ్యలు వినట్లేదా? 6. అందరిని సమానంగా చూస్తే.. కాంగ్రెస్ మైనార్టీల పక్షపాతి అన్న ముద్ర ఎందుకు పడిందంటారు?

# ఇంటింటి సర్వే నిర్వహించి ఓటర్ల జాబితా సవరించండి...


## మేడ్చల్ మల్కాజ్గిరి జిల్లా కలెక్టర్ గౌతమ్.





జిల్లా బ్యూరో మేడ్చల్ మల్కాజ్గిరి (గరుడ వార్త) : ఇంటి ఇంటి సర్వే నిర్వహించి ఓటర్ల జాబితాను సవరించి నియోజకవర్గాల వారిగా నివేదికలు సమర్పించాలని ఈ ఆర్ఓలను, ఎఈఆర్ఓలను మేడ్చల్ మల్కాజిగిరి జిల్లా కలెక్టర్ గౌతం ఆదేశించారు. బుధవారం మేడ్చల్ మల్కాజిగిరి జిల్లా కలెక్టరేట్ లోని విసి హాల్ లో ఈ ఆర్ఓలతో, ఎఈఆర్ఓలతో జిల్లా అదనపుకలెక్టరు విజయేందర్ రెడ్డితో కలిసి కలెక్టర్ గౌతం సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సమావేశంలో కలెక్టర్ మాట్లాడుతూ ఓటర్ల జాబితను ఎప్పటికప్పుడు అప్ డేట్ చేయాలని తెలిపారు. డెత్ కేసులు, షిఫ్టెడ్ కేసులు ఏమైనా ఉంటే భారతీయ ఎలక్షన్ కమీషన్ మార్గదర్శకాల ప్రకారం చర్యలు తీసుకోవాలన్నారు. ఒకే ఓటర్ పేరు రెండు సార్లు నమోదు అయితే ఓటర్ దగ్గర ఉన్న ఓటర్ ఐడి కార్డు ను పరిశీలించి అదనంగా ఉన్న ఐడి కార్డును తొలగించాలని కలెక్టర్ సూచించారు. ఈ కార్యక్రమంలో తహాసీల్దార్లు, సంబంధిత అధికారులు, తదితరులు పాల్గొన్నారు. –

# శామీర్ పేట చెరువులో కొనసాగుతున్న గణనాధుల నిమజ్జనాలు





శామీర్ పేట, (గరుడ వార్త) : శామీర్పేట పెద్ద చెరువులో గణనాధుల నిమజ్జనాలు కొనసాగుతున్నాయి. శామీర్ పేట పెద్ద చెరువులో వివిధ ప్రాంతాల నుంచి పెద్ద ఎత్తున గణేష్ విగ్రహాలను ఊరేగింపుగా తీసుకు వచ్చి చెరువులో నిమజ్జనం గావించారు. ఉమ్మడి శామీర్ పేట మండలంతో పాటు నగర శివారు ప్రాంతాల నుంచి గణేష్ విగ్రహాలను తీసుకువచ్చి చెరువులో నిమజ్జనం చేశారు. బుధవారం రాత్రి విద్యుత్ శాఖ సీజీఎం సాయిబాబా, ఎస్ ఈ రవికుమార్, డిఈ శ్రీనాథ్, ఏ డి ఈ రమణారెడ్డి, ఏఈ సురేందర్ లు నిమజ్జనాల ప్లాట్ఫారం ను సందర్శించి ఏర్పాట్లను పరిశీలించారు.

# ఉత్తమ పురస్కారం అందుకున్న శామీర్పేట గురుకుల కళాశాల ప్రిన్సిపల్



శామీర్ పేట, (గరుడ వార్త) : శామీర్ పేట గురుకుల కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ ఇష్రత్, ఉపాధ్యాయ దినోత్సవం సందర్భంగా ఉత్తమ ప్రిన్సిపాల్ గా అవార్డు అందుకున్నారు. బుధవారం తెలంగాణ సాంఘిక సంక్షేమ మహిళ డిగ్రీ గురుకుల కళాశాల శామీర్ పేట లో ఉత్తమ పురస్కారమందుకున్న ప్రిన్సిపల్ డాక్టర్ ఇష్రత్ ను అధ్యాపకులు, విద్యార్థులు ఘనంగా సన్మానించి శుభాకాంక్షలు తెలియజేశారు. రాష్ట్రంలోని గురుకుల కళాశాలల ప్రిన్సిపల్లలో ఉపాధ్యాయ దినోత్సవం సందర్భంగా సోషల్ వెల్ఫేర్ గురుకుల సొసైటీ వారు తెలంగాణ రాష్ట్రవ్యాప్తంగా ఉన్న 30 డిగ్రీ కళాశాలల ప్రిన్సిపాల్ లలో ఉత్తమ ప్రిన్సిపాల్ అవార్డును ఈ సంవత్సరానికి శామీర్ పేట లో ని తెలంగాణ సాంఘిక సంక్షేమ గురుకుల మహిళా డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ ఇష్రత్ కు అందించారు. ఈ సమావేశంలో అధ్యాపకులు ప్రిన్సిపాల్ ఇష్రత్ విద్యార్థుల పట్ల, కళాశాల పట్ల అంకిత భావం తో చేసిన కృషిని తెలియజేశారు. విద్యార్థులు పిన్సిపల్ గొప్పతనాన్ని తెలుపుతూ పాటలు, ఉపన్యాసాలు, నృత్యాలతో అలరించారు. ఈ కార్యక్రమంలో వైస్ ప్రిన్సిపాల్ డా. చేతన, అధ్యాపకులు, విద్యార్థినులు పాల్గొన్నారు.

# పేకాట రాయుళ్ల అరెస్ట్

శామీర్ పేట, (గరుడ వార్త) : పేకాటరాయుళ్లను షామీర్పేట పోలీసులు అరెస్ట్ చేశారు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం మూడు చింతలపల్లి మండలం ఉషార్ పల్లి పరిధిలోని డీర్స్ క్రిక్ ఫామ్ హౌస్ లో జీడిమెట్ల, మేడ్చల్ ప్రాంతాలకు చెందిన వ్యక్తులు పేకాట ఆడుతున్నట్లు విశ్వాసనీయ సమాచారం మేరకు మంగళవారం రాత్రి ఎస్ఓటి పోలీసులు, శామీర్ పేట పోలీసులు సంయుక్తంగా దాడి నిర్వహించారు. ఈ దాడిలో పేకాటాడుతున్న 13 మందిని అదుపులోకి తీసుకున్నారు.

వీరి వద్ద నుంచి రూ. 4, 37, 550 నగదు, 15 సెల్ ఫోన్లు, 2 సెట్ల ప్లేయింగ్ కార్డ్స్, 4 కార్లు ను స్వాదీనం చేసుకున్నట్లు పోలీసులు తెలిపారు. ఈ మేరకు శామీర్ పేట పోలీసులు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నారు.

# నిధులు రాక.. సమస్యలు తొలగక

సూర్యాపేట : అన్నదాతలకు సలహాలు, సూచనలు అందించేందుకు వీలుగా రెండు, మూడు గ్రామాల ప్రజలకు అందుబాటులో ఉండేందుకోసం గత ప్రభుత్వం 2021లో క్లస్టర్ల స్థాయిలో రైతు వేదికల నిర్మాణం చేపట్టింది. ప్రారంభ సమయంలో ఒక్కో వేదిక నిర్వహణకు ప్రతి నెల రూ.9 వేల చొప్పున నిధులు విడుదల చేయడంతో సాఫీగా సాగింది. కొత్తగా అధికారం చేపట్టిన ప్రభుత్వం రైతు వేదికలకు నిధుల మంజూరులో జాప్యం చేస్తుండటంతో వాటి నిర్వహణ వ్యవసాయ అధికారులకు భారంగా మారింది. నిధులు కొరవడటంతో నిర్వహణ లేక భవనాలు శిథిల దశకు చేరుతున్నాయి. శుభ్రం చేసేందుకు తాత్కాలికంగా నియమించిన కార్మికులు చాలా వరకు పనులు మానేశారు. అన్నదాతలు, ఏఈవోలు, సందర్శనకు వచ్చే అధికారులు కూడా కూర్చునేందుకు అనువుగా లేకుండా పోయాయి.

**అవస్థలు ఇవీ..**

ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా 73 మండలాల్లో 314 రైతు వేదికలు ఉన్నాయి. వాటికి ప్రతి నెల రావాల్సిన నిధులు నిలిచిపోయాయి. వానాకాలం సీజన్ ప్రారంభం కావడంతో ఇప్పటికే వివిధ పంటల సాగులో రైతులు నిమగ్నమయ్యారు. ప్రతి మంగళవారం ఈ వేదికల్లో



'రైతు నేస్తం' కార్యక్రమం నిర్వహిస్తున్నారు. ఇందుకు అక్కడికి వచ్చిన అధికారులు, అన్నదాతలు వేదిక నిర్వహణ లేమి కారణంగా అవస్థలు పడుతున్నారు. కొన్ని చోట్ల గ్రామాలకు దూరంగా ఉండటంతో రక్షణ కొరవడి ఆకతాయిలు అద్దాలు పగులగొడుతున్నారు. రైతు వేదికలను నిత్యం శుభ్రం చేయడం, మంచినీటిని ఏర్పాటు, ఇతరత్రా పనులు క్షేత్ర స్థాయి అధికారులకు తలకుమించిన భారంగా మారాయి. కొన్నిచోట్ల మండల వ్యవసాయ క్లస్టర్ అధికారులే ఆ ఖర్చులను సొంతంగా వెల్లదీస్తున్నారు. నిధులు విడుదల చేస్తేనే ప్రయోజనకరంగా ఉంటుందని పలువురు కర్షకులు అభిప్రాయపడుతున్నారు.

**ఉన్నతాధికారులకు నివేదించాం** శ్రీధర్‌రెడ్డి, డీఏవో, సూర్యాపేట : రైతు వేదికల నిర్వహణ నిధులు రావాల్సి ఉంది. ఈ విషయమై ఉన్నతాధికారులకు నివేదించాం. ప్రతి మంగళవారం వేదికల్లో రైతు నేస్తం కార్యక్రమం నిర్వహిస్తున్నాం. ఏఈవోలు తప్పనిసరిగా హాజరై రైతులకు సాగులో సాంకేతిక పద్ధతులపై అవగాహన కల్పిస్తున్నారు. త్వరలో నిధులు విడుదలయ్యే అవకాశం ఉంది. ఆకతాయిలు ప్రభుత్వ ఆస్తులను ధ్వంసం చేస్తే కఠిన చర్యలు తప్పవు.

# ఆదాయ వనరులపై ఆర్టీసీ దృష్టి

ఆదిలాబాద్ : ప్రజా రవాణా సంస్థ ఆర్టీసీ ఆదాయ వనరులను పెంచుకోవడంపై దృష్టి సారించింది. ఆదిలాబాద్ రీజియన్ పరిధిలో ఆర్టీసీ బస్టాండ్లలో ఖాళీగా ఉన్న స్టాళ్లు, క్యాంటిన్లు, పార్కింగ్ స్థలాలు, ఇతర బహిరంగ స్థలాల్లో వ్యాపారాల నిమిత్తం అద్దెకు ఇవ్వాలని నిర్ణయించింది. ఈ మేరకు అధికారులు ఔత్సాహికుల నుంచి ఆన్‌లైన్‌లో టెండర్లను ఆహ్వానిస్తూ ప్రకటన జారీ చేశారు. వచ్చే నెలలో ఆర్టీసీకి చెందిన మొత్తం 84 పక్కా, బహిరంగ స్థలాలను ఈ–టెండర్, మాన్యువల్ టెండర్, వేలం వేయనున్నారు. నిబంధనల ప్రకారం అత్యధిక ధర చెల్లించి స్టాళ్లు, బహిరంగ స్థలాలను దక్కించుకున్న వారికి నిర్ణీత కాల వ్యవధితో ఒప్పందం చేసుకుని అద్దెకు ఇవ్వనున్నారు. మహాలక్ష్మి పథకం అమలు కారణంగా ఆర్టీసీ బస్సుల్లో రద్దీ పెరిగి బస్టాండ్లు ప్రయాణికులతో కిటకిటలాడుతుండడంతో వ్యాపారాల నిమిత్తం అద్దెకు తీసుకుంటే గిట్టుబాటు అవుతుందనే భావన వ్యక్తమవుతోంది.

**ఆరు డిపోల పరిధిలో..**

ఆదిలాబాద్ ఆర్టీసీ రీజియన్ పరిధిలో ఆదిలాబాద్, ఉట్నూరు, నిర్మల్, భైంసా, ఆసిఫాబాద్, మంచిర్యాల డిపోలున్నాయి. ఆరు డిపోలు, వాటి



పరిధిలో మండల కేంద్రాల్లో ఆర్టీసీ పేరిట విలువైన ఆస్తులున్నాయి. కొన్ని బస్టాండ్లలో పక్కా స్టాళ్లు ఉండగా మరికొన్ని చోట్ల ఖాళీ స్థలాలున్నాయి. ఇది వరకు అద్దెకు ఇచ్చిన వాటిలో గడువు ముగిసిన స్టాళ్లను, క్యాంటిన్లను, ఖాళీ స్థలాలను గుర్తించారు. బేకరీ, కూల్‌డ్రింక్స్, పండ్లు, పార్కింగ్ స్టాండ్, ఫాస్ట్‌ఫుడ్ సెంటర్, ఫ్యాన్సీ, జనరల్ స్టోర్స్, సెల్‌ఫోన్ రిపేరింగ్ కేంద్రాలు తదితర నిర్దేశిత వ్యాపారాలు చేసుకునేందుకు అనుమతించారు. మరికొన్ని స్టాళ్లు, ఖాళీ స్థలాల్లో అనుమతి ఉన్న ఏ ఇతర వ్యాపారాలైనా చేసుకునేందుకు అవకాశం కల్పించారు. ఆయా స్టాళ్లు, స్థలాలకు విస్తీర్ణాన్ని బట్టి నిర్ణీత ధరలను సైతం నిర్ణయించారు. స్టాళ్లు, బహిరంగ స్థలాలకు వేర్వేరుగా టెండరు నిర్వహించనున్నారు. ఈ–టెండర్‌లోని స్టాళ్లకు ఆగస్టు 8లోగా, మాన్యువల్ టెండర్‌కు వచ్చే నెల 16లోగా, వేలంపాటకు 12లోగా దరఖాస్తులను సమర్పించాల్సి ఉంటుంది.

**పారదర్శకంగా టెండరు విధానం**

సోలోమన్, ఆర్టీసీ రీజనల్ మేనేజరు, ఆదిలాబాద్

ఆర్టీసీ రీజియన్ పరిధిలో ఖాళీగా ఉన్న క్యాంటిన్లు, స్టాళ్లు, పార్కింగ్, బహిరంగ స్థలాలను వ్యాపార నిమిత్తం అద్దెకు ఇవ్వాలని సంస్థ నిర్ణయించింది. టెండరు ప్రక్రియను పారదర్శకంగా నిర్వహిస్తాం. వ్యాపారాలను ఏర్పాటు చేసుకుని ఉపాధి పొందాలనుకునే వారు ఎవరైనా డీడీలు చెల్లించి టెండరులో పాల్గొనవచ్చు.

# వస్తున్నారు.. వెళ్తున్నారు!

కరీంనగర్ : కరీంనగర్ కమిషనరేట్ పరిధిలోని మానకొండూర్ పోలీసు ఠాణా వివాదాలకు పిరునామాగా నిలుస్తోంది. కనీసం రెండేళ్లపాటు పని చేయాల్సిన అధికారులు ఏదో ఒక కారణంతో అర్ధాంతరంగా మరో చోటకు బదిలీ అవుతున్నారు. ఈ విషయం పోలీసు శాఖలో చర్చనీయాంశమైంది. అయిదేళ్ల కిందట పని చేసిన పోలీసు అధికారి ఠాణా ఆవరణలో ఓ గుత్తేదారు జన్మదిన వేడుకలు నిర్వహించి.. వివాదాస్పదంగా మారారు. ఆయనను కమిషనరేట్‌కు అటాచ్ చేశారు. తర్వాత వచ్చిన మరో అధికారి ఉద్యోగ కాలం పూర్తి కాకముందే 18 నెలలకు కమిషనరేట్‌కు బదిలీ అయ్యారు. అనంతరం వచ్చిన మరో అధికారికి ఇసుక లారీ విషయంలో విజిలెన్స్,



ఎన్‌ఫోర్స్‌మెంట్ అధికారులతో వివాదం చోటు చేసుకోగా.. ఆయనను సీపీ కార్యాలయానికి అటాచ్ చేశారు. ఆ తర్వాత వచ్చిన అధికారి ఏడాదిన్నరపాటు పని చేసి.. మరో చోటకు బదిలీ అయ్యారు.

తాజాగా మరొకరు..

జులై నెలాఖరులో కరీంనగర్ పొరుగు జిల్లాలో విధులు నిర్వహిస్తున్న ఇన్‌స్పెక్టర్ స్థాయి అధికారి స్థానిక ప్రజాప్రతినిధి సహకారంతో పోస్టింగ్ తెప్పించుకున్నట్లు సామాజిక మాధ్యమాల్లో చక్కర్లుకొట్టింది. ఆయన 35 రోజులు గడవకముందే అనారోగ్య సెలవుపై వెళ్లడం చర్చనీయాంశమైంది. స్థానిక ప్రజాప్రతినిధి జిల్లా పోలీసు అధికారిపై చేసిన ప్రకటన చర్చకు దారితీసింది. తర్వాత ప్రజాప్రతినిధి మరోమారు మీడియా ముందుకు వచ్చిన ఆసక్తికర విషయాలు వెల్లడించడంతో ఆ అధికారి సెలవుపై వెళ్లారు. ఆయన తిరిగి విధుల్లో చేరేందుకు అయిష్టం చూపుతున్నట్లు సమాచారం. ఉన్నతాధికారులకు సైతం తన అభిప్రాయాన్ని వెల్లడించినట్లు తెలిసింది. ఇప్పుడు మానకొండూర్ ఠాణా నూతన అధికారిగా ఎవరు వస్తారో అని ఆ శాఖలో ఆసక్తిగా చూస్తున్నారు. ఇదిలా ఉండగా.. లూప్‌లైన్‌లో ఉన్న పలువురు పోలీసు అధికారులు ఈ ఠాణా బాధ్యతలు చేపట్టేందుకు పోలీసు శాఖ, ప్రజాప్రతినిధి మెప్పు కోసం ప్రయత్నాలు సాగిస్తున్నట్లు తెలిసింది.

## బజాజ్ ఎలక్ట్రానిక్స్ లక్ష్యంగా యూపీఐ మోసాలు.. ముఠా అరెస్ట్!

హైదరాబాద్: బజాజ్ ఎలక్ట్రానిక్స్ లక్ష్యంగా పెట్టుకొని యూపీఐ మోసాలకు పాల్పడుతున్న రాజస్థాన్‌కు చెందిన ముఠాను పోలీసులు అరెస్ట్ చేశారు. ఈ ముఠా మూడు కమిషనరేట్లతోపాటు తెలంగాణ వ్యాప్తంగా సుమారు రూ.4కోట్ల మేర యూపీఐ మోసాలకు పాల్పడినట్లు గుర్తించారు. బజాజ్ ఎలక్ట్రానిక్స్ ఫిర్యాదుతో ప్రత్యేక బృందాలను ఏర్పాటు చేసి దర్యాప్తు చేపట్టినట్లు సైబరాబాద్ డీసీపీ నరసింహ తెలిపారు. ఈ యూపీఐ మోసాల వెనుక ఆర్గనైజ్డ్ క్రైమ్ ఉంది. ముందుగా ముఠా సభ్యులు వస్తువులు కొనడానికి ఎలక్ట్రానిక్స్ షోరూమ్‌కి వెళ్తారు. విలువైన వస్తువుల్ని కొనుగోలు చేశాక యూపీఐ ద్వారా చెల్లింపులు చేస్తారు. చెల్లింపులు చేయడానికి బజాజ్ షోరూమ్‌లోని క్యూఆర్ కోడ్‌ను రాజస్థాన్‌లోని సహచరులకు పంపుతారు. అక్కడి నుంచి క్యూఆర్ కోడ్‌తో డబ్బులు పంపిస్తారు. ఎలక్ట్రానిక్స్ వస్తువులు డెలివరీ అయ్యాక పొరపాటున వేరే ఖాతాకు డబ్బు బదిలీ చేశామంటూ ఛార్జ్ బ్యాక్ ఆప్షన్ ద్వారా తిరిగి డబ్బు పొందుతున్నారు.రాజస్థాన్‌కు చెందిన 20 నుంచి 25 ఏళ్ల వయసు ఉన్న యువకులంతా కలిసి ఈ ముఠాగా ఏర్పడ్డారు. యూపీఐ మోసాల ద్వారా కొనుగోలు చేసిన ఎలక్ట్రానిక్ వస్తువుల్ని ఇతరులకు అమ్మి సొమ్ము చేసుకుంటారు. గత రెండు నెలలుగా 1,125 యూపీఐ లావాదేవీలు జరిపినట్లు గుర్తించాం. ఈ ముఠాకు చెందిన వారిలో హైదరాబాద్‌కు చెందిన 13 మందిని అదుపులోకి తీసుకున్నాం. రాజస్థాన్‌కు ప్రత్యేక బృందాన్ని పంపుతున్నాం. ఈ మోసాల వెనుకున్న ప్రధాన నిందితుడిని పట్టుకుంటాం" అని డీసీపీ తెలిపారు.

## హైడ్రా కేసులు.. ముందస్తు బెయిల్ పిటిషన్ దాఖలు చేసిన ప్రభుత్వ అధికారులు

హైదరాబాద్: అక్రమ నిర్మాణాల అనుమతులకు సంబంధించి పలువురు ప్రభుత్వ అధికారులపై సైబరాబాద్ ఆర్థిక నేరాల విభాగానికి హైడ్రా కమిషనర్ రంగనాథ్ ఇటీవల ఫిర్యాదు చేశారు. అక్రమ నిర్మాణాల కూల్చివేత సందర్భంగా ఈ అక్రమ అనుమతుల వ్యవహారం వెలుగులోకి వచ్చింది. హైడ్రా ఫిర్యాదు మేరకు అధికారులపై



సైబరాబాద్ ఆర్థిక విభాగం పోలీసులు కేసులు నమోదు చేశారు. చందానగర్, బాచుపల్లిలోని ప్రభుత్వ ఉద్యోగులపై ఈమేరకు చర్యలు తీసుకున్నారు.మరోవైపు కేసుల నమోదుతో ప్రభుత్వ అధికారులు తాజాగా ముందస్తు బెయిల్ పిటిషన్ దాఖలు చేశారు. బాచుపల్లి ఎమ్మార్వో పూల్ సింగ్, లాండ్ అండ్ రికార్డ్ సర్వే అసిస్టెంట్ డైరెక్టర్ శ్రీనివాసులు, హెచ్‌ఎండీఏ అసిస్టెంట్ ప్లానింగ్ ఆఫీసర్ సుధీర్ కుమార్ ముందస్తు బెయిల్‌కు పిటిషన్ దాఖలు చేసుకున్నారు. ఈక్రమంలో ప్రభుత్వ అధికారులకు బెయిల్ ఇవ్వొద్దంటూ కోర్టును ఆర్థిక విభాగం పోలీసులు కోరారు.

# హైడ్రా.. ఝుళిపించెన్ కొరడా



రాయదుర్గం: రాజధానిలో హైడ్రా పెద్దఎత్తున చేపట్టిన అక్రమ నిర్మాణాల తొలగింపు మరోసారి చర్చనీయాంశమైంది. కొందరు ఆక్రమణల తొలగింపును అడ్డుకున్నా అధికారులు వారిని అక్కడి నుంచి పంపించి నిర్మాణాలను కూల్చివేశారు. ఒకరిద్దరు కిరోసిన్ పోసుకుని హల్‌చల్ చేశారు. భారీఎత్తున పోలీసుల తోడ్పాటుతో ఇటువంటి వారందరినీ పక్కకు తీసుకువచ్చి గుర్తించిన అక్రమ భవనాలను నేలమట్టం చేశారు. దుండిగల్ కత్వా చెరువు దగ్గర చేపట్టిన అక్రమ నిర్మాణాలకు అనుమతులు ఉన్నాయంటూ నిర్మాణ సంస్థ ఒక్కో కొనుగోలుదారుడి నుంచి రూ.కోటిన్నర వరకు వసూలు చేసినట్లు తేలింది.సున్నం చెరువు దగ్గర మాదాపూర్ సున్నం చెరువు దగ్గర భారీ నిర్మాణాలను, షెడ్లను అయిదా రు గంటల్లోనే అధికారులు కూల్చివేశారు. అయితే తాము షెడ్లను అద్దెకు తీసుకుని గోదాములుగా వాడుకుంటున్నామని, రూ.లక్షలు అప్పుసొప్పు చేసి హోటల్, పాన్ డబ్బా ఏర్పాటు చేసుకున్నామని, సామగ్రి తీసుకునేందుకు అరగంట సమయం కూడా ఇవ్వలేదని బాధితులు వాపోయారు. ప్రభుత్వం న్యాయం చేయాలని కోరారు.

కిరోసిన్ పోసుకుని హల్‌చల్‌తమ నివాసాలను తొలగించారంటూ ఓ వ్యక్తి తన భార్యతో కలిసి ఒంటిపై కిరోసిన్ పోసుకొని నిప్పంటించుకునేందుకు యత్నించగా అక్కడే ఉన్న పోలీసులు అడ్డుకున్నారు. అనంతరం వారిని అక్కడి నుంచి తరలించారు. కాగా కూల్చివేతలను చూసేందుకు జనాలు భారీగా తరలిరావడంతో మాదాపూర్ 100 ఫీట్ల రోడ్డులో ట్రాఫిక్ జాం అయింది. అటుగా వెళ్లే వాహనదారులు ఇబ్బంది పడ్డారు.

అనుమతులిచ్చిన అధికారులపై చర్యలు తీసుకోవాలని డిమాండ్

దుండిగల్ కత్వా చెరువు వద్ద నీటిపారుదల శాఖ అధికారులు ఎఫ్‌టీఎల్, బఫర్‌జోన్‌లో ఉన్న ఇళ్లకు ఎర్రమార్కు ఓవైపు వేస్తుండగా మరోవైపు హైడ్రా అధికారులు కూల్చివేతలు చేపట్టారు. మొత్తం 28 విల్లాలను గుర్తించగా అందులో 8 విల్లాలలో కొనుగోలుదారులు ఉంటున్నారు. ఇప్పటికిప్పుడు ఇళ్లు ఎలా ఖాళీ చేయాలని బాధితులు వాపోయారు. రెండురోజులు సమయం ఇస్తున్నామని, ఈ లోపు ఖాళీ చేయాలని అధికారులు చెప్పారు. విల్లాలను కొనుగోలు చేసిన యజమానులు కన్నీరు మున్నీరుగా విలపించారు. ఈ క్రమంలో ఓ వ్యక్తి స్వల్ప గుండిపోటుకు గురయ్యాడు. ఒక్కో ఇంటిని రూ.1.50 కోట్లకు కొనుగోలు చేసి మోసపోయామని వాపోయారు. తమ ఇళ్ల నిర్మాణాలకు అనుమతులు ఇచ్చిన అధికారులపై కఠిన చర్యలు తీసుకోవాలని బాధితులు డిమాండ్ చేశారు.

# సగం మందికి మంట.. జీరో కరెంటు బిల్లులు పొందుతున్నా అందని గ్యాస్ రాయితీ



హైదరాబాద్: అర్హత ఉన్నా తమకు వంట గ్యాస్ సబ్సిడీ అందడంలేదని పలువురు ఆరోపిస్తున్నారు. జీరో బిల్లులకు అర్హత సాధించినా గ్యాస్ సబ్సిడీ ఎందుకు అందడంలేదు.. ఖాతాల్లో ఆ మొత్తం జమ కాకపోవడానికి కారణమేంటని పౌరసరఫరాలశాఖ, గ్యాస్ ఏజెన్సీల చుట్టూ తిరుగుతున్నారు. ప్రజా పాలనలో స్వీకరించిన దరఖాస్తుల ఆధారంగా బీపీఎల్ కుటుంబాలను అర్హులుగా గుర్తించి జీరో విద్యుత్ బిల్లు, వంటగ్యాస్ సబ్సిడీకి లబ్ధిదారులుగా ఎంపిక చేశారు. గ్రేటర్ పరిధిలో 17 లక్షలకు పైగా తెలుపు రేషన్ కార్డులున్నాయి. ఇందులో 7.4 లక్షల మందికే జీరోబిల్లు అమలవుతుండగా.. కేవలం 3 లక్షల మందికే వంట గ్యాస్ సబ్సిడీ బ్యాంకు ఖాతాల్లో జమ అవుతోంది.

సబ్సిడీ ఎంత..?

ప్రస్తుతం 14.5 కేజీల గ్యాస్ సిలిండర్ ధర రూ.855లు. అర్హులైన లబ్ధిదారులకు కేంద్ర ప్రభుత్వం నుంచి రూ.41లు, రాష్ట్ర ప్రభుత్వం నుంచి రూ.315లు సబ్సిడీ అందుతోంది. గ్యాస్ కొనుగోలు చేసిన రెండు నుంచి మూడు రోజుల్లో ఈ సబ్సిడీ మొత్తం బ్యాంకు ఖాతాల్లో జమ అవుతుంది.

ఎవరిని సంప్రదించాలో తెలియక...

గ్యాస్ సబ్సిడీ అంశానికి సంబంధించి ఎవరిని సంప్రదించాలో తెలియక అర్హులు గందరగోళానికి గురవుతున్నారు. 'అన్నీ అర్హతలు ఉన్నా గ్యాస్ సబ్సిడీ పథకం అమలు కావడం లేదని బహదూర్‌పురా(కామటిపురా)కు చెందిన మహ్మద్‌ఖాన్ ఆయిల్ కంపెనీలకు 'ఎక్స్'లో ఫిర్యాదు చేశారు. జీరో విద్యుత్ బిల్లుకు అర్హత సాధించగా.. వంట గ్యాస్ రాయితీ డబ్బు జమ కావడం లేదని వాపోయారు.

గ్యాన్ సబ్సిడీ ఎంతమందికి అందుతుందనే వివరాలు పౌరసరఫరాలశాఖ అధికారులు బహిర్గతం చేయడం లేదు.

వంట గ్యాస్ కనెక్షన్లు

హైదరాబాద్ జిల్లాలో 14 లక్షలు

ఉమ్మడి రంగారెడ్డి జిల్లాలో 16 లక్షలు

గ్రేటర్ పరిధిలో తెలుపురంగు రేషన్ కార్డులు 17 లక్షలు

జీరో కరెంటు బిల్లులు వర్తించిన వారి సంఖ్య 7,40,512

# సమస్యల చెరలో చెరువులు



బోయినపల్లి:ఏటా వర్షాకాలంలో హుజూరాబాద్ మండలం చెల్పూరు పెద్ద, చిన్న చెరువులతో స్థానికులు ఇబ్బందులు పడుతున్నారు. చెరువులకు సరైన కట్టలు, షట్టర్లు లేకపోవటంతో పలు కాలనీల్లోకి వరద నీరు చేరి ముంపునకు గురవుతున్నాయి. పది గ్రామాల్లోని సుమారు వెయ్యి ఎకరాల ఆయకట్టుకు ఈ చెరువులు నీరందిస్తున్నాయి. కట్టలు బలహీనపడి.. షట్టర్ల నిర్మాణం అంతంతమాత్రంగానే ఉన్న పట్టించుకునే వారే లేరు. రెండు చెరువులను అనుసంధానిస్తూ గ్రామం మధ్యలోంచి మట్టితో నిర్మించిన కాలువ వల్ల భారీ వర్షాలు పడ్డప్పుడు ఇళ్లలోకి నీరు చేరుతోంది. దీంతో గ్రామస్థులు బిక్కుబిక్కుమంటూ గడపాల్సిన పరిస్థితి నెలకొంది. చెరువు కట్టల నిర్మాణ సమయంలో ఏర్పాటు చేసిన తూములు నాసిరకంగానే ఉన్నాయని గ్రామస్థులు ఆరోపిస్తున్నారు. షట్టర్లు ఎత్తకుండానే నీరు లీకేజీ అవుతుందని రైతులు వాపోతున్నారు. పెద్ద చెరువుకు రెండు వైపులా మత్తడి ఉండటంతో కట్ట తెగిపోయే ప్రమాదముందని ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. గత ఏడాది భారీ వర్షాలతో చిన్న చెరువు కట్ట 600 మీటర్ల మేర కోతకు గురైంది. ఇంత జరుగుతున్న అధికారులు అటు వైపు వెళ్లిన దాఖలలు లేవు.అధికారులు తీసుకోవాల్సిన చర్యలు

పెద్ద, చిన్న చెరువులను అనుసంధానిస్తూ నిర్మించిన లింక్ కెనాల్‌ను, పంట కాలువలను శాశ్వత (సీసీ) కెనాల్‌గా మార్చాలి.

పెద్ద చెరువుకు ఏర్పాటు చేసిన రెండు మత్తడిల మధ్య హైలెవల్ వంతెన ఏర్పాటు చేయాలి.చెరువుల కట్టలకు శాశ్వత మరమ్మతులు చేపట్టాలి.తూములను పూర్తిస్థాయిలో నిర్మించాలి.నెరవేరని హామీలు అప్పటి మంత్రులు ఈటల రాజేందర్, గంగుల కమలాకర్, ఎమ్మెల్సీ కౌశిక్‌రెడ్డి, ఈఎన్‌సీ శంకర్, ఎస్‌ఈ శివకుమార్ తదితరులు అప్పట్లో చెరువులను పరిశీలించారు. చెరువుల మధ్యలో చేపట్టాల్సిన లింక్ కెనాల్ నిర్మాణం, మత్తడిపై హైలెవల్ వంతెన ఏర్పాటు చేస్తామని ప్రకటించారు. కానీ నేటికి ఎటువంటి చర్యలు లేకపోయేసరికి ఎక్కడి వేసిని గొంగలి అక్కడే ఉందన్న చందంగా మారింది. ఈ విషయమై నీటి పారుదలశాఖ డీఈ రామును వివరణ కోరగా ఎలాంటి ప్రతిపాదనలు ఇంకా సిద్ధం చేయలేదని సమాధానమిచ్చారు.

# దిగువన.. దినదిన గండం

పాల్వంచ : పాల్వంచ మండలం గంగదేవిగుప్ప, దంతెలబోరకు చెందిన ఏడుగురు వ్యక్తులు గత బుధవారం పశువులు మేపడానికి, చేపల వేటకు వెళ్లారు. కిన్నెరసాని గేట్లు ఎత్తడంతో అకస్మాత్తుగా వరద పెరిగింది. నది పాయలో చిక్కుకున్న ఆరుగురిని డీడీఆర్‌ఎఫ్ బృందం రక్షించగా, ఒకరు గల్లంతయ్యారు. ఆ మరుసటి రోజే మరో ఐదుగురూ మళ్లీ వరదలో చిక్కుకుపోవడం అధికారులనూ కలవరపెట్టింది. 2012లో... దంతెలబోర కూలీలు సొంపల్లికి కూలిపనులకు వెళ్లారు. సాయంత్రం తిరిగొస్తున్న సమయంలో ఒక్కసారిగా వరద చుట్టుముట్టింది. కూలీలంతా ఎత్తు దిబ్బ మీదకు వెళ్లడంతో ప్రమాదం తప్పింది. గతంలో ఇలాంటి ఘటనల్లో పశు సంపదను ఎంతో కోల్పోవాల్సి వచ్చింది.

కిన్నెరసానికి తరచూ వరద పోటెత్తుతోంది. వర్షాలకు ఎగువన ఉన్న తాడ్వాయి, గుండాల, ఆళ్లపల్లి తదితర ఏరియాల నుంచి జలాశయానికి ప్రవాహం భారీగా వచ్చి చేరుతోంది. గంట గంటకూ ఉద్ధృతిలో తేడా ఉంటోంది. దీంతో కొత్తగూడెం థర్మల్ విద్యుత్తు కేంద్రం (కేటీపీఎస్) అధికారులు ఒక్కసారిగా గేట్లు పైకెత్తుతున్నారు. ఫలితంగా దిగువన నది పరీవాహక గ్రామాలు, మొర్రేడు వాగు సంగమం ప్రాంతాలు ఉన్నట్టుండి ముంపుబారిన పడుతున్నారు. ఎలాంటి సమాచారం




లేకపోవడంతో పశువుల కాపరులు, రైతులు వరదలో చిక్కుకుంటున్నారు. ఒక్కోసారి పశుసంపద కొట్టుకుపోయి ఆర్థిక నష్టం వాటిల్లుతోంది. ఈ నేపథ్యంలో అధికారులు పక్కాగా సమాచారం అందించాలని ముంపు బాధిత గ్రామాల ప్రజలు కోరుతున్నారు.

ప్రత్యామ్నాయం లేకే ఇలా..

ఒకసారి దిగువ గ్రామాలకు సైరన్ ఇచ్చి గేట్లు ఎత్తేలోపే అనూహ్యంగా వరద పోటెత్తుతోందని కేటీపీఎస్ అధికారులు చెబుతున్నారు. ఆలస్యం చేస్తే డ్యాంకు నష్టం వాటిల్లుతుందని పేర్కొంటున్నారు. అదే జరిగితే భారీగా ప్రాణ, ఆస్తి నష్టం చవిచూడాల్సి వస్తుందని, తమకు ప్రత్యామ్నాయం లేదంటున్నారు. అయినా, గేట్లు ఎత్తిన ప్రతీ సారి గ్రామాల్లో సైరన్లు మోగిస్తున్నట్లు తెలిపారు. తమ సిబ్బంది ప్రభావిత ప్రాంతాల ప్రజలను అప్రమత్తం చేస్తున్నారని చెప్పారు. ఓ వాట్సాప్ గ్రూప్ ఏర్పాటు చేసి తాజా సమాచారాన్ని ఎప్పటికప్పుడు అందిస్తున్నాం అని అన్నారు.అప్రమత్తతమే రక్ష..గేట్లు ఎత్తితే కిన్నెరసాని పరివాహక ప్రాంతాలకు అసలు వెళ్లకపోవడమే ఉత్తమం. అధికారులు ఉన్నట్టుండి మరిన్ని గేట్లు పైకి ఎత్తుతున్నారు. సెప్టెంబర్ 1న రాత్రి పది గంటలకు తొలుత 4 గేట్లు ఎత్తుతున్నట్లు ప్రకటించారు. అర్ధరాత్రి సమయంలో 12 గేట్లు ఎత్తడంతో కిన్నెరసాని, రాజాపురం, నాగారం, దంతెలబోరలో భారీ నష్టం జరిగింది. 15 ఎకరాల్లో పంట కొట్టుకుపోయింది. వాగు ఒడ్డు కోతకు గరైంది. ఇటువంటి పరిస్థితుల దృష్ట్యా ప్రజలు వాగులు దాటే ప్రయత్నం చేయవద్దని కేటీపీఎస్ అధికారులు హెచ్చరిస్తున్నారు. పశువులు మేపడానికి, కూలీ పనులకు అంటూ వెళ్లి ప్రాణాల మీదికి తెచ్చుకోవద్దని చెప్పారు.

# దిశ చూపితేనే ప్రయోజనం..!

నల్గొండ : కేంద్ర ప్రభుత్వ ప్రాయోజిత పథకాలపై పర్యవేక్షణతో పాటూ వాటి అమలు, నిధుల ఖర్చుపై సమీక్షించాల్సిన జిల్లా అభివృద్ధి సమన్వయ, పర్యవేక్షణ కమిటీ (దిశ) సమావేశ నిర్వహణపై సందిగ్ధం నెలకొంది. ఈ కమిటీకి స్థానిక ఎంపీ అధ్యక్షత వహిస్తుండగా... కలెక్టరు మెంబర్ సెక్రటరీగా వ్యవహరిస్తారు. నల్గొండ జిల్లా దిశ కమిటీ నల్గొండ, భువనగిరి పార్లమెంటు పరిధిలో విస్తరించి ఉంది. దీంతో ఈ కమిటీకి నల్గొండ ఎంపీ కుందూరు రఘువీర్‌రెడ్డి ఛైర్మన్‌గా, భువనగిరి ఎంపీ చామల కిరణ్‌కుమార్‌రెడ్డి కో–ఛైర్మన్‌గా వ్యవహరించనుండగా.. కలెక్టరు నారాయ ణరెడ్డి మెంబర్ కార్యదర్శిగా వ్యవహరిస్తారు.ప్రతి మూడు నెలలకొకసారి నిర్వహించాల్సిన ఈ సమావేశాలు నల్గొండ, భువనగిరి ఎంపీలుగా ప్రాతినిథ్యం వహించిన గుత్తా సుఖేందర్‌రెడ్డి, బూర నర్సయ్యగౌడ్ హయాంలో తప్పితే గత కొన్నాళ్లుగా మొక్కుబడికే పరిమితమయ్యాయి. తాజాగా ఎంపీలు బాధ్యతలు చేపట్టి మూడు నెలలు గడవడంతో కొత్త కమిటీ సమావేశం ఎప్పుడు అన్నది తేలాల్సి ఉంది. ఈ కమిటీలో స్థానిక ఎంపీ, కలెక్టరుతో పాటూ జిల్లాలోని శాసనసభ్యులు, శాసనమండలి సభ్యులు, పురపాలిక ఛైర్మన్లు, జడ్పీ ఛైర్మన్లు, ఎంపీపీలు, జిల్లా గ్రామీణాభివృద్ధి అధికారులు



(డీఆర్‌డీవో)లతో పాటూ పలువురు నామినేటేడ్ సభ్యులుంటారు. పాత కమిటీ రద్దు కాగా.. కొత్త కమిటీ ఏర్పాటుకు ఇప్పటికే కలెక్టరు నారాయణరెడ్డి నోటిఫికేషన్ జారీ చేశారు. నాలుగైదు రోజుల్లో కొత్త కమిటీ ఏర్పాటు ప్రక్రియ పూర్తి కానుందని సంబంధిత వర్గాలు వెల్లడించాయి. మరోవైపు భువనగిరిలో 20 రోజుల క్రితమే స్థానిక ఎంపీ చామల కిరణ్‌కుమార్‌రెడ్డి దిశ సమావేశం నిర్వహించి పలు సమస్యలపై చర్చించారు.

చర్చ జరిగితేనే ప్రయోజనం ఎంపీ ల్యాడ్స్‌తో పాటూ కేంద్ర ప్రభుత్వ పథకాలైన ప్రధానమంత్రి గ్రామీణ సడక్ యోజన, పీఎం ఫసల్‌బీమా యోజన, ముద్రా రుణాలు, పీఎం ఆవాస్ యోజన తదితర పథకాల అమలుపై నిర్మాణాత్మక చర్చ జరిగితేనే కమిటీ సమావేశం ప్రజలకు ప్రయోజనకరంగా ఉంటుంది. మూడు నాలుగేళ్లుగా నిర్మాణాత్మక చర్చ జరగకపోవడంతో అర్హులు చాలా వరకు కేంద్ర ప్రభుత్వ పథకాలు అందడం లేదు. ఈ ఏడాది నుంచి రాష్ట్ర ప్రభుత్వం ఫసల్‌బీమా యోజన పథకాన్ని అమలు చేస్తామని ప్రకటించడంతో ప్రకృతి వైపరీత్యాలు సంభవించినప్పుడు రైతులకు పరిహారం అందే వీలుంటుంది. దిశ సమావేశంలో ఇలాంటి సమస్యలను చర్చిస్తే రైతులకూ ప్రయోజ నకరంగా ఉంటుంది. కొత్త కమిటీకి మార్గదర్శకాలిచ్చాం పాత కమిటీని రద్దు చేసి కొత్త కమిటీ ఏర్పాటకు మార్గదర్శకాలిచ్చాం.రోజుల్లో కొత్త కమిటీని ఏర్పాటు చేసి సమావేశ తేదీపై నిర్ణయం తీసుకుంటాం. సి. నారాయణరెడ్డి, కలెక్టరు, నల్గొండ

# ఖాళీ స్థలాలు.. దోమలకు ఆవాసాలు..!

సిరిసిల్ల : వానాకాలం మొదలైందంటే చాలు దోమల విజృంభణ అధికమవుతుంది... కునుకు తీద్దామంటే చెవుల వద్ద విసుగు పుట్టే శబ్దాలతో నిద్రపోనివ్వవు. మన రక్తాన్ని పీలుస్తూ వ్యాధులను వ్యాపింపజేస్తాయి. మురుగు కాల్వలు, అపరిశుభ్ర ప్రాంతాలతో పాటు ఖాళీ స్థలాలు దోమల పుట్టుకకు నిలయాలుగా మారుతున్నాయి. ఖాళీ స్థలాలను శుభ్రం చేసుకోవాలని అధికారులు సూచిస్తున్నా ఎవరూ దీనిని పట్టించుకోవడం లేదు. ఫలితంగా ఇళ్ల మధ్యన మురుగు, అపరిశుభ్ర వాతావరణ నెలకొని దోమల వ్యాప్తి అధికమవుతోంది. జిల్లా కేంద్రమైన సిరిసిల్లలో రోజురోజుకూ జనాభా పెరుగుతోంది. పల్లెల నుంచి పట్టణాలకు ఉపాధికి కోసం వస్తున్నారు... ఇక్కడే అన్ని ప్రభుత్వ కార్యాలయాలు ఏర్పాటు కావడంతో భూముల ధరలుసైతం పెరిగాయి. చుట్టుపక్కన పల్లెల నుంచి వచ్చేవారు జిల్లా కేంద్రంలో నివసించేందుకు ఆసక్తి కనబరుస్తున్నారు. ఇలా చాలామంది ఇంటి నిర్మాణానికి స్థలాలను కొనుగోలు చేశారు. కొంతమంది భవనాలు నిర్మిస్తే చాలా కాలనీల్లో స్థలాలను ఖాళీగా వదిలేశారు. ఇటీవల కురుస్తున్న వర్షాలతో ఖాళీ స్థలాల్లోకి వ్యర్థాలు చేరి మురుగు కూపాలను తలపిస్తున్నాయి. వీటిని ఆవాసాలుగా చేసుకొని దోమలు తమ సంతతి పెంచుకుంటున్నాయి. సాయంత్రం అయిదు దాటితే చాలు ఇళ్లలో దోమల బాధతో తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నామని ఇక్కడి ప్రజలు వాపోతున్నారు. మురుగు కాల్వలు సరిగా లేక సంజీవయ్యనగర్, అంబికానగర్, వెంకంపేట, సర్దార్‌నగర్, అసీఫ్‌పురా, ఆటోనగర్, తారకరామనగర్, పద్మనగర్, అశోక్‌నగర్, శాంతినగర్‌లో వరదనీరు భారీగా చేరుతోంది.

ప్రత్యేక శ్రద్ధ అవసరం...

మున్సిపాలిటీ ఆధ్వర్యంలో ప్రతీ నిత్యం పారిశుద్ధ్య పనులు చేపడుతున్నారు. పేరుకుపోయిన చెత్తాచెదారాన్ని ఎప్పటికప్పుడు శుభ్రం చేస్తున్నారు. నాలుగు ఫాగింగ్ యంత్రాలు ఉండగా రెండు పాడైపోయాయి. ఈ సీజన్‌కు సరిపడా బ్లీచింగ్‌ను అధికారులు సమకూర్చారు. పట్టణంలోని 80 మంది భూ యజమానులకు వారి ఖాళీ స్థలాలను శుభ్రపరచాల్సిందిగా నోటీసులు జారీ చేశారు. ఇప్పటి వరకు 30 మంది నోటీసులకు స్పందించినట్లు అధికారులు చెబుతున్నారు. నోటీసులకు స్పందించే వారు చాలా తక్కువమంది ఉంటున్నారు. ఆయా స్థలాల్లో పారిశుద్ధ్య పనులు చేపట్టి యజమానులకు జరిమానా విధించే అవకాశం ఉన్నా అధికారులు ఉదాసీనంగా వ్యవహరిస్తున్నారన్న ఆరోపణలు ఉన్నాయి. సరైన మురుగునీటి పారుదల లేకపోవడం, అరకొర పారిశుద్ధ్య పనులతో సమస్య పరిష్కారం కావడం లేదని పలువురు అంటున్నారు. ఏటా సీజన్‌లో తాత్కాలిక చర్యలు చేపడుతున్నారు తప్ప ఈ సమస్యలకు శాశ్వత పరిష్కారం లభించడం లేదు.

అవగాహన కల్పిస్తున్నా...

జిల్లా కేంద్రంలో వ్యాధుల నియంత్రణకు అధికారులు చర్యలు ప్రారంభించారు. ఇళ్లలో పాత టైర్లు, పడేసిన కొబ్బరిబోండాలు, పూల కుండీలు పనికి రాని వస్తువులను గుర్తిస్తున్నారు. వైద్య బృందంతో కలిసి ఇంటింటి సర్వే చేపడుతున్నారు. డ్రైడే ఆవశ్యకతపై వివరిస్తున్నారు.వరదనీరు ఆగిన చోట జేసీబీలతో కచ్చాకాల్వలు తీయిస్తున్నారు. నెల రోజులుగా డివిజన్ల వారీగా ఫాగింగ్ చేయిస్తున్నారు. ఖాళీస్థలాల్లో నిల్వనీరు లేకుండా చూడాలని వివరిస్తున్నా పలువురు దీనిని పట్టించుకోవడం లేదు.

విపరీతంగా పెరిగాయికాలనీలో దోమలు విపరీతంగా పెరిగాయి. సాయంత్రం అయితే తలుపులు తెరిచి ఉంచే పరిస్థితి లేదు. వర్షాకాలంలో మా ఇంటి పరిసరాల్లో నీరు నిల్వ ఉంటుంది. ఎడతెరిపి లేకుండా వర్షం కురిస్తే ఇబ్బందులు మరింతగా పెరుగుతున్నాయి. అధికారులు స్పందించి నీరు నిల్వఉండకుండా చర్యలు చేపట్టాలి.

ముద్దం శ్రీనివాసగౌడ్, సంజీవయ్యనగర్

నోటీసులు జారీ చేశాం

పట్టణంలోని ఖాళీ స్థలాలను గుర్తించి యజమానులకు నోటీసులు అందించాం. నీటి నిల్వ ప్రదేశాల్లో అయిల్‌బంతులు వేస్తున్నాం. ఎప్పటికప్పుడు డ్రైనేజీలను శుభ్రం చేస్తూ బ్లీచింగ్ చల్లించేలా చర్యలు చేపడుతున్నాం. నోటీసులకు స్పందించకుంటే ఖాళీ స్థలాలను మున్సిపాలిటీ ద్వారా శుభ్రం చేయించి ఇంటి అనుమతులకు వచ్చిన సమయంలో ఆ రుసుము చెల్లించేలా చర్యలు తీసుకుంటున్నాం.

లావణ్య, మున్సిపల్ కమిషనర్

# శిక్షణ గుహాలు..

హైదరాబాద్: ఒకరు మాత్రమే నడవ గలిగే మెట్ల మార్గంతో మూడు, నాలుగు అంతస్తుల్లో శిక్షణ కేంద్రాలు నడుస్తున్నాయి. వాటిలో రోజూ వేలాది మంది విద్యార్థులకు శిక్షణ తరగతులు నడుస్తున్నాయి. ఒక మంచం పట్టే గదిలో 20 కుర్చీలతో ప్రైవేటు లైబ్రరీలు కొనసాగుతున్నాయి. వాటికి అనుమతుల్లేవు. భద్రత డొల్ల. మంచి గాలి, వెలుతురనే ప్రశ్నే ఉండదు. ఆర్టీసీ క్రాసురోడ్డులోని అశోక్‌నగర్‌లో కనిపించే దారుణ దృశ్యాలివి. ఢిల్లీలో తాజాగా కురిసిన వర్షాలకు.. ఓ ఐఏఎస్ శిక్షణ కేంద్రం లైబ్రరీలోకి నీరు చేరి, అందులో చదువుతున్న ముగ్గురు శవాలై తేలడంతో.. అశోక్‌నగర్‌లోని దారుణ పరిస్థితులు మళ్లీ చర్చకొచ్చాయి. డబ్బు కోసం కక్కుర్తి..ఒకప్పుడు అశోక్‌నగర్‌లో నివసించేందుకు చాలా మంది ఆసక్తి చూపేవారు. ఇప్పుడు అక్కడున్న ఇళ్లన్నీ శిక్షణ కేంద్రాలుగా, హాస్టళ్లుగా, స్టడీ హాళ్లుగా మారుతున్నాయి. కాసులకు



కక్కుర్తి పడుతూ.. చిన్న చిన్న ఇళ్లను శిక్షణ కేంద్రాలుగా, వసతి గృహాలుగా, లైబ్రరీలుగా మార్చుతున్నారు. ఓ శిక్షణ కేంద్రంలో పాఠం వినేందుకు 500ల మంది విద్యార్థులు హాజరవుతున్నారు. కుర్చీలన్నీ ఒకదాని వెనుక ఒకటి ఏర్పాటై ఉంటాయి. ఒకసారి కూర్చున్నారంటే.. తరగతి పూర్తయి అందరూ వెళ్లే వరకు కదల్లేని పరిస్థితి. అందరికీ ఒకే మరుగుదొడ్డి. ఒకే మెట్ల మార్గం.పార్కింగ్ వసతి ఉండదు. ఇళ్లను ప్రైవేటు స్టడీ హాళ్లుగా మార్చి.. చిన్న చిన్న గదుల్లో 20కి తగ్గకుండా కుర్చీలను ఏర్పాటు చేస్తున్నారు. ఇక్కడి పలు శిక్షణ కేంద్రాల్లో ఏదేనీ ప్రమాదం చోటుచేసుకుంటే.. ఇరుకైన మెట్ల మార్గాల వల్ల తొక్కిసలాట జరుగుతుందని విద్యార్థులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ఇటీవల భారీ వర్షంతో అశోక్‌నగర్‌లోని రోడ్లపై నడుముల్లోతున నీరు నిలిచిందని, రెండు గంటలపాటు శిక్షణ కేంద్రాల్లోని విద్యార్థులంతా లోపలే ఉండి పోయారని గుర్తు చేస్తున్నారు.

# తలసరి ఆదాయం మెరుగు



పెద్దపల్లి : ఉమ్మడి జిల్లా అన్ని రంగాల్లో ప్రగతి పథంలో దూసుకెళ్తోంది. తలసరి ఆదాయం, వ్యవసాయం, పరిశ్రమలు, ఉపాధి హామీ, సేవ తదితర రంగాల్లో ముందు వరసలో నిలుస్తోంది. అక్షరాస్యత, వృద్ధి రేటులో ఆశించిన ప్రగతి ఉన్నప్పటికి కొన్నింటిలో వెనకబడి ఉంది. తెలంగాణ సామాజిక, ఆర్థిక సర్వే-24లో ఉమ్మడి జిల్లా పురోగతి ఇలా.

**స్వల్పంగా వృద్ధి**

అన్ని రకాల వస్తువులు, సేవల రూపంలో వచ్చే ఆదాయాన్ని జిల్లాలోని పౌరులందరికీ విభజిస్తే ఒక్కో పౌరుడి వాటాను జిల్లా తలసరి ఆదాయంగా లెక్కిస్తారు. రాష్ట్ర తలసరి ఆదాయం సగటు రూ.3,11,649తో పోల్చితే ఉమ్మడి జిల్లాలో తక్కువ ఉన్నప్పటికి గతేడాదితో పోల్చితే మాత్రం స్వల్పంగా పురోగతి ఉంది. పెద్దపల్లి జిల్లాలో ప్రజల ఆదాయం నెలవారీగా చూస్తే ఒక్కొక్కరు రూ.19,313 సంపాదిస్తున్నారు. జగిత్యాల జిల్లాలో తక్కువగా రూ.15,257 ఆర్జిస్తున్నారు. పరిశ్రమల ఏర్పాటుకు అవకాశం

ఉమ్మడి జిల్లాలో బొగ్గు గనులు, ఎన్టీపీసీ, గ్రానైట్ పరిశ్రమలు ఉన్నాయి. ఎంఎస్ఎంఈ (సూక్ష్మ, చిన్న, మధ్యతరహా పరిశ్రమలు) మొత్తం కలిపి 86,552 ఉండగా నాలుగు జిల్లాల్లో కరీంనగర్ ప్రథమ, రాజన్న సిరిసిల్ల చివరి స్థానాల్లో నిలిచాయి. వరి, పత్తి, పసుపు, మామిడి దిగుబడులు, అపారమైన వనరులు ఉన్నప్పటికి ఆహారశుద్ధి పరిశ్రమలు నెలకొల్పేందుకు పారిశ్రామికవేత్తలు ముందుకు రావడం లేదు. మరిన్ని పరిశ్రమలు ఏర్పాటు చేస్తే ఉపాధి అవకాశాలు మెరుగుపడనున్నాయి.

తక్కువ రహదారుల జిల్లా పెద్దపల్లి

రహదారి సగటును పరిశీలిస్తే ఉమ్మడి జిల్లాలో పెద్దపల్లి అతి తక్కువ రహదారులు ఉన్న జిల్లాగా నమోదైంది. వంద చదరపు కిలోమీటర్లకు రాష్ట్ర సగటు 98.8 కి.మీ.లు ఉండగా పెద్దపల్లి జిల్లాలో 97.2 కి.మీ.ల పొడవునా ఉండి స్వల్పంగా తగ్గింది. అత్యధిక రహదారుల సాంద్రత కలిగిన జిల్లాగా కరీంనగర్ 137.4 కి.మీ అగ్రస్థానంలో నిలిచింది.

నాలుగు జిల్లాల పరిధిలో ప్రజలకున్న సగటు భూమి పరిశీలిస్తే రాజన్న సిరిసిల్లలో అత్యధికంగా సగటు భూమి కలిగి ఉన్నట్లు తేలింది. ఒకరికి సగటున 2 ఎకరాల పైన భూమి ఉంది. కరీంనగర్‌లో 1.80 ఎకరాలు కలిగి ఉన్నట్లు తేలింది.

జాతీయ ఉపాధి హామీలో రాజన్న సిరిసిల్ల జిల్లా హవా కొనసాగింది. ఏడాదిలో 17.6 లక్షల పనిదినాల లక్ష్యంగా ఉండగా 34.6 లక్షల పనిదినాలు పూర్తి చేసి ప్రథమంగా నిలిచింది.

వ్యవసాయ కూలీలు అధికమే

వ్యవసాయ రంగంలో ఉమ్మడి జిల్లా అగ్రగామిగా నిలుస్తున్నప్పటికి రైతుల కంటే వ్యవసాయ కూలీలు ఎక్కువగా ఉన్నారు. నాలుగు చోట్లా ఇదే పరిస్థితి. జగిత్యాల జిల్లాలో అత్యధికంగా ఉన్నట్లు నమోదైంది.

# స్థాయి పెరిగినా సేవలు అంతంతే!



ధర్మపురి : ధర్మపురి పట్టణంలోని ప్రభుత్వాసుపత్రి స్థాయి మారిన సదుపాయాలు కరువయ్యాయి. సరిపడా వైద్యులు, పరికరాలు లేకపోవడంతో సేవలు అంతంత మాత్రంగానే అందుతున్నాయి. మొదట 8 పడకలు.. ఆ తర్వాత 20 పడకలకు.. కొన్నేళ్లకు 30 పడకలకు.. 2023లో గత ప్రభుత్వం వైద్య శాఖ నుంచి వైద్య విధాన పరిషత్తుకు మార్పు చేసి 50 పడకలకు ఆస్పత్రి స్థాయిని పెంచింది. క్యాడర్ స్ట్రెంతు ఏర్పాటు చేయకపోవడంతో సమస్యలు రెండేళ్ల నుంచి కొలిక్కి రావడం లేదు. దవఖానాలో 53 వైద్యుల పోస్టులకు 23 మందినే కేటాయించారు. వీరిలో కేవలం 8 మంది మాత్రమే పనిచేస్తున్నారు. చిత్రమేమిటంటే ఈ 8 మందిలోనూ ఇద్దరు డిప్యూటేషన్‌పై ఇతర ఆసుపత్రులకు వెళ్లారు. ఉన్నతాధికారుల పర్యవేక్షణ లేక ఉన్నవారు ప్రతిరోజు ఉదయం 10 గంటలకు వచ్చి.. మధ్యాహ్నం 2 గంటలకు వెళ్లిపోతున్నారు. అత్యవసర కేసులకు ఒకరిద్దరు వైద్య సిబ్బంది మాత్రమే అందుబాటులో ఉంటున్నారు. ఈ ఆస్పత్రిని ఇటీవల కలెక్టర్ సత్యప్రసాద్ తనిఖీ చేసి.. సేవలు విస్తరించాలని ఆదేశించారు.

**సిబ్బంది.. పరికరాల కొరత**

రెండు ఫార్మాసిస్టు పోస్టులకు ఒకరే ఉండగా, మరొకరు డిప్యూటేషన్‌పై వేరేచోట పనిచేస్తున్నారు. రక్తపరీక్షలు చేసేందుకు ట్యాబ్ టెక్నీషియన్‌లు ఇద్దరు అవసరం కాగా.. ఒకరే ఉన్నారు. ప్రస్తుతం జ్వరాల ప్రబలే అవకాశం ఉండటంతో ఒక్కడిపైనే పనిభారం పడుతోంది.

ఎక్స్‌రే ప్లాంటు.. రక్తనిధి కేంద్రం ఏర్పాటు చేయాల్సిన అవసరం ఉంది. రూ.5 కోట్ల వ్యయంతో గత ప్రభుత్వం 10 ఐసీయూలను మంజూరు చేసి పరికరాలను కూడా పంపించింది. అయితే సగం వరకు మాత్రమే వచ్చాయి. మిగతా సగం నిలిచిపోయాయి. సిబ్బంది నియామకంలో కూడా జాప్యం జరుగుతోంది.

త్వరలోనే అన్ని పోస్టులు భర్తీ అవుతాయి

ఆస్పత్రిలో సమస్యలను పరిష్కరిస్తూనే వైద్య సేవలందిస్తున్నాం. త్వరలోనే అన్ని పోస్టులు భర్తీ చేసేందుకు ప్రభుత్వం చర్యలు తీసుకుంటోంది. వైద్యులు సకాలంలోనే హాజరై సేవలందిస్తున్నారు. డా.శ్రీకాంత్, ఇన్‌ఛార్జి సూపరింటెండెంట్, ధర్మపురి సామాజిక ప్రభుత్వ ఆసుపత్రి

# అభివృద్ధి సూచి.. భవిత దిక్సూచి..

సంగారెడ్డి :ఉమ్మడి మెదక్, వికారాబాద్ జిల్లాల్లో వనరులకు కొరత లేదు. యువత అధికంగానే ఉన్నారు. వనరుల సద్వినియోగంతో పాటు యువతకు సరైన అవకాశాలు కల్పిస్తే ప్రగతి సాధ్యమన్నది నిపుణుల మాట. అందుబాటులో ఉన్న వనరుల వినియోగమే ప్రధానం. తెలంగాణ సామాజిక ఆర్థిక, సామాజిక నివేదిక-2024 ఇదే విషయాన్ని వెల్లడిస్తోంది. ఆయా సమస్యలు అధిగమిస్తే నాలుగు జిల్లాలు పురోగతిలో దూసుకెళ్లడం ఖాయం. ఈ నేపథ్యంలో అంశాల వారీగా ప్రగతి, తదితర వివరాలపై కథనం.

**సంగారెడ్డిలో అబ్బాయికి పెళ్లి కావడం కష్టమే..**

సంగారెడ్డి జిల్లాలో అబ్బాయికి పెళ్లి కావడం కాసింత కష్టమే. సామాజిక ఆర్థిక సర్వే దీన్నే సూచిస్తోంది. ఇక్కడ పురుషులు మహిళల కంటే అధికంగా ఉండటమే దీనికి ప్రధాన కారణం. ఇప్పటికే అమ్మాయిలు సరిగా దొరక్క అబ్బాయిల తల్లిదండ్రులు పాట్లు పడుతున్నారు. భవిష్యత్తులో మరిన్ని కష్టాలు తప్పేలా లేవు. గ్రామీణ ప్రాంతాలతో పోల్చితే పట్టణాల్లో మరింత ఎక్కువగా కనిపిస్తోంది. సిద్దిపేట, మెదక్, వికారాబాద్ జిల్లాలు మాత్రం మెరుగ్గానే ఉన్నాయి. మహిళల అధిపత్యమే కనిపిస్తోంది.

**కూలీలకు ఉపాధి 'హామీ'** వలసలు నివారించి ఉన్న ఊళ్లోనే ఉపాధి కల్పించాలన్నది జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకం లక్ష్యం. ఈ పథకం కింద జాబ్ కార్డులు కలిగి ఉన్న వారికి ఏడాదిలో 100 పని దినాలు కల్పించాల్సి ఉంది. ప్రతి ఏటా జిల్లాలకు లక్ష్యాన్ని నిర్దేశిస్తుంటారు. గత ఆర్థిక సంవత్సరం ఉమ్మడి మెదక్ జిల్లాతో పాటు వికారాబాద్ జిల్లాలోనూ శతశాతం లక్ష్యాలను అధిగమించారు.

**వ్యవసాయంతోనే జీవనయానం**

ఉమ్మడి మెదక్‌తో పాటు వికారాబాద్ జిల్లాల్లో అత్యధికులకు వ్యవసాయమే జీవనాధారం. గ్రామీణ జిల్లా వికారాబాద్‌లో రైతులు ఎక్కువ మంది ఉండటం గమనార్హం. వ్యవసాయ కూలీల విషయం వచ్చేసరికి సంగారెడ్డిలోనే అధికంగా ఉన్నారు. పరిశ్రమలు ఎక్కువగా ఉండటంతో సంగారెడ్డి జిల్లాలో కార్మికులు ఎక్కువగా ఉంటారనుకుంటాం. ఇక్కడ వీరిది రెండో స్థానం. సిద్దిపేటలో జలాశయాల నిర్మాణంతో సాగుకు ఊతమిచ్చినట్లయింది. ఆహార అనుబంధ రంగ పరిశ్రమలకు ప్రభుత్వం ప్రాధాన్యం ఇస్తుండటం సాగుకు మరింత ప్రోత్సాహం అందినట్లే.

**స్థూల ఉత్పత్తిలో** జిల్లాల ఆర్థిక వృద్ధి స్థూల జిల్లా దేశీయోత్పత్తి (జీడీపీ) ద్వారా తెలుస్తుం ది. వస్తువుల ఉత్పత్తి, సేవల విలువతో జీడీపీని లెక్కిస్తారు. ఇందులో సంగారెడ్డి జిల్లా ముందుంది. రాష్ట్రంలో నాలుగో స్థానంలో ఉండగా, సిద్దిపేట 11, మెదక్ 15, వికారాబాద్ 21వ స్థానంలో ఉన్నాయి. అధికారులు ప్రత్యేక చొరవ చూపి వస్తువుల తయారీని పరుగెత్తించాలి. తూప్రాన్, వర్గల్, సిద్దిపేట, తాండూరు తదితర చోట్ల పరిశ్రమల ఏర్పాటుకు వనరులు పుష్కలంగా ఉన్నాయి.

**సగం మంది దూరమే**

నాలుగు జిల్లాల్లో ఉన్న జనాభాలో సగం మంది మాత్రమే పనులు చేస్తుండటం గమనార్హం. మిగతా వారంతా పనులకు దూరంగా ఉంటున్నారు. ఇక సంగారెడ్డి జిల్లాలో అయితే 45.5 శాతం మందే పనులు చేస్తూ జీవనం సాగిస్తున్నారు. ఉపాధి, ఉద్యోగావకాశాలకు కొదవ లేకపోయినా ఇలాంటి పరిస్థితి ఉండటం గమనార్హం. మిగతా మూడు జిల్లాల్లో కాస్త నయం. దీనిపై అధికారులు ప్రత్యేక దృష్టిసారించాల్సిన అవసరం ఉంది.

**లెక్క భారీగానే..**ఉమ్మడి మెదక్, వికారాబాద్ జిల్లాల్లో సంగారెడ్డి ప్రజల తలసరి ఆదాయం పెరిగి రాష్ట్రంలోనే మూడో స్థానంలో నిలవడం విశేషం. ఉపాధి అవకాశాలు మెరుగ్గా ఉండటమే దీనికి ప్రధాన కారణం. అతిపెద్దదైన పారిశ్రామిక వాడ పటాన్‌చెరులో విస్తరించి ఉండటంతో పాటు జిన్నారం, జహీరాబాద్ ప్రాంతాల్లో పరిశ్రమలు వెలియడం కలిసొచ్చింది. హైదరాబాద్‌కు సమీపంలోని బీహెచ్‌ఈఎల్, అమీన్‌పూర్‌లో సాఫ్ట్‌వేర్ ఇంజినీర్లు నివాసం ఉంటున్నారు. మూడేళుగా తలసరి ఆదాయంలో పెరుగుదల కనిపిస్తోంది. మిగతా జిల్లాల్లో ఆశించిన స్థాయిలో లేదు. ఇక్కడి యువతకు ఉపాధి కల్పిస్తే మెరుగుపడుతుంది.

**అక్షరాస్యతే కీలకం** నాలుగు జిల్లాల్లోనూ అక్షరాస్యత రాష్ట్ర సగటు కంటే తక్కువగా ఉండటం గమనార్హం. హైదరాబాద్‌కు సమీపంలో ఉన్నా ఈ అంశంలో వెనుకబాటు అభివృద్ధికి అవరోధంగా మారింది. సంపూర్ణ అక్షరాస్యత సాధనకు ఎన్నో కార్యక్రమాలు అమలు చేసినా ఫలితాలు ఆ స్థాయిలో కనిపించలేదు. ప్రధానంగా వికారాబాద్, మెదక్ జిల్లాల్లో తీవ్ర ప్రభావం చూపుతోంది. సంగారెడ్డి, సిద్దిపేట జిల్లాలు నయంవే. జిల్లాల యంత్రాంగం ఈ విషయంపై ప్రత్యేక దృష్టిసారించాల్సిన అవసరం ఉంది.

**మురుస్తున్న పల్లెలు..**

నాలుగు జిల్లాల్లో పట్టణాలు రోజురోజుకూ విస్తరిస్తున్నాయి. అయినా ఇప్పటికీ గ్రామీణ ప్రాంతాల్లోనే అత్యధికులు జీవనం సాగిస్తున్నారు. పట్టణాల్లో నివాసం ఉండాలంటే సంపాదన అదే స్థాయిలో ఉండాలి.

# పంచాయతీ ఎన్నికలకు కసరత్తు షురూ

భువనగిరి : గ్రామ పంచాయతీ ఎన్నికలకు కసరత్తు మొదలైంది. స్థానిక సంస్థల ఎన్నికల ప్రక్రియను వేగవంతం చేయాలని సీఎం రేవంత్‌రెడ్డి ప్రత్యేక సమీక్షలో అధికారులను ఆదేశించిన విషయం తెలిసిందే. దీంతో రాష్ట్ర ఎన్నికల సంఘం ఆ దిశగా ఏర్పాట్లను మొదలు పెట్టింది. గ్రామ పంచాయతీల్లో వార్డు మ్యాపింగ్, వార్డుల వారీగా ఓట్ల జాబితా తయారీ కోసం డాటా ఎంట్రీ ఆపరేటర్ల(డీఈవో) శిక్షణ షెడ్యూల్‌ను ఎన్నికల సంఘం విడుదల చేసింది. ప్రతి జిల్లా నుంచి ఐదుగురు ఆపరేటర్లకు హైదరాబాద్‌లోని డా.మర్రి చెన్నారెడ్డి మానవ వనరుల అభివృద్ధి సంస్థ(ఎంసీఆర్ హెచ్‌ఆర్డీ)లో శిక్షణ అందించనుంది. వీరు తిరిగి ఆయా జిల్లాలోని మండలాల్లో డేటా ఎంట్రీ ఆపరేటర్లకు తర్ఫీదు అందించాల్సి ఉంటుంది.

**పేరుకుపోయిన సమస్యలు**

గ్రామ పంచాయతీల్లో ఈ ఏడాది ఫిబ్రవరి 1న సర్పంచులు, పాలకవర్గాల పదవీకాలం ముగిసింది. అదే నెల 2 నుంచి పంచాయతీల్లో ప్రత్యేక అధికారుల పాలన అమల్లోకి వచ్చింది. ప్రత్యేక అధికారులు తమ శాఖపరమైన సొంత విధులతో పాటు పంచాయతీల్లో సర్పంచుల




స్థానంలో అదనంగా పనిచేయాల్సి రావడంతో పాలన పట్టుతప్పింది. ఒక్కో అధికారికి నాలుగైదు పంచాయతీలు అప్పగించడంతో వీరు గ్రామాలకు చుట్టపు చూపుగా వచ్చి వెళుతున్నారు. దీంతో పల్లెల్లో సమస్యలు పేరుకుపోతున్నాయి. పంచాయతీలకు సకాలంలో నిధులు అందడం లేదని, నిర్వహణ ఖర్చుల కోసం అప్పులు తెస్తున్నామని ఇటీవల ప్రజావాణిలో పంచాయతీ కార్యదర్శులు వినతిపత్రాలు అందజేయడం గమనార్హం. పాలకవర్గాలు ఉంటే వెనువెంటనే సమస్యల పరిష్కారానికి నిర్ణయాలు తీసుకునేందుకు వీలుంటుంది. ఈ నేపథ్యంలో ప్రభుత్వం స్థానిక సంస్థల ఎన్నికలు నిర్వహించాలని నిర్ణయించింది.

**3 నుంచి శిక్షణ** నల్గొండ, సూర్యాపేట, యాదాద్రి జిల్లాల ఆపరేటర్లకు ఆగస్టు 3న ఉదయం 10.30 గంటలకు హైదరాబాద్ ఎంసీఆర్ హెఆర్డీలో శిక్షణ ప్రారంభం కానుంది. ఇందుకు జిల్లాకు ఐదుగురు ఆపరేటర్లను ఎంపిక చేసి ఈనెల 31న పంపించాలని రాష్ట్ర ఎన్నికల సంఘం కార్యదర్శి అశోక్‌కుమార్ ఉత్తర్వులు జారీ చేశారు. అసెంబ్లీ నియోజకవర్గాల తాజా ఓటర్ల జాబితా నుంచి గ్రామాల్లోని వార్డుల వారీగా పంచాయతీ ఎన్నికల ఓటర్ల జాబితాను రూపొందించాలని రాష్ట్ర ఎన్నిక సంఘం సూచించింది.

# అత్యవసర సేవలకు అవస్థలు

నర్సాపూర్: ఆపద సమయాల్లో క్షతగాత్రులను దూర ప్రాంతాలకు తీసుకెళ్లే అంబులెన్స్‌లు దుస్థితికి చేరాయి. డివిజన్ కేంద్రమైన నర్సాపూర్ ప్రభుత్వ ప్రాంతీయ వైద్యశాలలో ఒక అంబులెన్స్ పూర్తిగా పాడవడంతో పక్కనపెట్టారు. మరోటి తరచూ మరమ్మతులకు గురవుతోంది. ఈ స్థితిరో రోగులు ప్రైవేటు వైపు మొగ్గు చూపడంతో వారు రోగుల అవసరాలను బట్టి అందినంద దండుకుంటున్నారు.

నర్సాపూర్ ప్రభుత్వ ప్రాంతీయ వైద్యశాలకు రెండు దశాబ్దాల క్రితం కేటాయించిన అంబులెన్స్ పూర్తిగా శిథిలావస్థకు చేరడంతో దానిని తిప్పడం లేదు. ఆసుపత్రి ఆవరణలోనే నిరుపయోగంగా ఉంచుతున్నారు. దీనికి మరమ్మతులు చేసినా డబ్బులు వృథా అని వాడటం లేదు. దీంతో అది కాస్త తుప్పు పట్టి పాడైపోతోంది. నిర్వహణ లేక అధ్వానంగా మారుతున్నా వేలం వేయడం లేదు. తుక్కుకింద మారకముందే అమ్మేస్తే ఎంతో కొంత ఆసుపత్రికి లాభం చేకూరుతుందని పట్టణవాసులు చెబుతున్నారు. ఆసుపత్రికి మరో అంబులెన్స్ వచ్చి ఎనిమిదేళ్లవుతోంది. గతంలో మెదక్ ఎంపీ కొత్త ప్రభాకర్‌రెడ్డి తన నిధుల నుంచి దీనిని కేటాయించారు. ఇప్పటివరకు 2 లక్షల కిలోమీటర్లు తిప్పారు. దీంతో ఇది కాస్త తరచూ మరమ్మతులకు గురవుతుండటంతో ఇబ్బందులు తప్పడం లేదు.

**సంగారెడ్డి, హైదరాబాద్‌లకు..**

నర్సాపూర్ ఆసుపత్రి నుంచి నిత్యం సంగారెడ్డి, హైదరాబాద్‌లోని కార్పొరేట్, గాంధీ, ఉస్మానియా వంటి ప్రభుత్వ ఆసుపత్రులకు రోగులను అత్యవసర పరిస్థితుల్లో తరలిస్తుంటారు. ఈ అంబులెన్స్‌కు




వాహనచోదకుడు మినహా ఇతర సిబ్బంది నియామకం ఇంతవరకు చేపట్టలేదు. రోడ్డు ప్రమాదాలు, ఘర్షణలు, ఆత్మహత్యాయత్నాలు తదితర సమయాల్లో వచ్చే రోగులను అత్యవసరమైతే మెరుగైన చికిత్సకు హైదరాబాద్, సంగారెడ్డి తదితర ప్రాంతాలకు తరలిస్తున్నారు. మెదక్-నర్సాపూర్-హైదరాబాద్, సంగారెడ్డి-నర్సాపూర్-తూప్రాన్ రెండు జాతీయ రహదారులతో పాటు, ఇతర గ్రామాల రోడ్లపై కూడా తరచూ ప్రమాదాలు చోటుచేసుకుంటున్నాయి. సమయానికి అంబులెన్స్ సేవలు అందకపోవడంతో ఆసుపత్రి ఆవరణలో నిలుపుతున్న ప్రైవేటు అంబులెన్స్‌లను ఆశ్రయిస్తున్నారు. ఉన్నతి ఒక్కటి కూడా సరైన సేవలందించకపోవడంతో రోగులపై ఆర్థిక భారం పడుతోంది.

**ప్రతిపాదనలు పంపాం**

పావని, ఆసుపత్రి పర్యవేక్షకురాలు

ఒక అంబులెన్స్ పాడవడంతో వినియోగించడం లేదు. మరోటి తరచూ మరమ్మతులకు గురవుతుండటంతో ఇటీవల కొత్తదానికి ప్రతిపాదనలు తయారు చేసి పంపించాం. వంద పడకల ఆసుపత్రికి తగ్గట్లుగా మరో అంబులెన్స్ కేటాయిస్తే రోగులకు మేలు జరుగుతుంది.




ఏలూరు: ముఖ్యమంత్రి చంద్రబాబు గోదావరి జిల్లాల పర్యటనకు వెళ్లారు. ఏలూరు జిల్లాలో వర్షాలకు దెబ్బతిన్న ప్రాంతాలను ఆయన పరిశీలించారు. కొల్లేరు పరివాహక ప్రాంతాలను విహంగ వీక్షణం ద్వారా పరిశీలించారు. రోడ్డు మార్గంలో తమ్మిలేరు వరద ప్రవాహాన్ని పరిశీలించారు. అనంతరం కొల్లేరు, ఉప్పుటేరు, తమ్మిలేరు వరదలపై అధికారులతో సీఎం సమీక్ష నిర్వహించారు. పంట నష్టం జరిగిన ప్రాంతాల్లో ఎకరాకు రూ.10 వేలు పరిహారం చెల్లించనున్నట్లు చంద్రబాబు ప్రకటించారు. గతంలో బుడమేరుకు గండ్లు పడితే వైకాపా ప్రభుత్వం పూడ్చలేదని సీఎం చంద్రబాబు విమర్శించారు. "వైకాపా పాలనలో బుడమేరును ఆక్రమణలకు గురి చేశారు. తప్పుడు రిజిస్ట్రేషన్లు చేసి.. అక్రమ కట్టడాలకు అనుమతులిచ్చారు. తప్పుడు బిల్లులతో డబ్బును కాజేశారు. ప్రకృతి విపత్తులు వచ్చినప్పుడు ప్రజలే ఎక్కువ నష్టపోతారు. మంత్రి నిమ్మల రామానాయుడు బుడమేరు వద్ద 5 రోజులు ఉండి గండ్లు పూడ్చారు కాబట్టే విజయవాడకు వరద తగ్గింది. ప్రకాశం బ్యారేజీ వద్ద పడవలు వదిలింది వైకాపాకు చెందిన వారే. పడవలు వదిలిపెట్టి తెలియనట్టు వ్యవహరిస్తున్నారు. అక్కడికి వచ్చినవి అక్రమ ఇసుక వ్యాపారం చేసిన పడవలే.

**విజయవాడలో సాధారణ పరిస్థితులకు 10 రోజులు పట్టింది :** నేరాలు చేసే వ్యక్తులు.. ప్రజా జీవితంలో ఉంటూ ప్రజలను ఇబ్బందులకు గురి చేస్తున్నారు. వైకాపా మొత్తం దోచేసింది. అప్పులు మిగిల్చారు.. వాటిని భర్తీ చేస్తున్నాం. ఖాళీ ఖజానాతో అభివృద్ధి ఆగిపోయింది. ప్రభుత్వం వద్ద డబ్బుల్లేవు.. అయినా నెట్టుకుంటూ వస్తున్నాం. కృష్ణా నదికి ఊహించని విధంగా వరద వచ్చింది. గత ప్రభుత్వ తప్పిదాలతో విజయవాడ అతలాకుతలమైంది. దీంతో బుడమేరుకు గండ్లు పడ్డాయి. తెదేపా హయాంలో మంజూరు చేసిన నిధులనూ పక్కన పెట్టారు. ఎక్కడా ఒక డ్రెయిన్, కాలువ తవ్విన పాపాన పోలేదు. గత ఐదేళ్ల దుర్మార్గ పాలనలో వ్యవస్థలన్నీ భ్రష్టుపట్టాయి. పనిచేసే వ్యక్తులు పనిచేయడం మానేశారు. విజయవాడలో సాధారణ పరిస్థితులు రావడానికి 10 రోజులు పట్టింది. బుడమేరు గండ్లు పూడ్చటానికి ఒక యుద్ధమే చేశాం. ఆర్మీ వాళ్లే మావల్ల కాదని చేతులెత్తేశారు. మా మంత్రులు దగ్గరుండి గండ్లు పూడ్పించారు. ప్రకాశం బ్యారేజీ కొట్టుకుపోతే లంక గ్రామాలు ఏమైపోతాయి? అప్పుడు బాబాయిని చంపి నెపం నెట్టారు.. ఇప్పుడు బోట్లతో విధ్వంసం సృష్టించాలని కుట్ర పన్నారు. నేరాలు చేసే వారు ప్రజా జీవితంలో ఉంటే ఇలానే ఉంటుంది. నేరస్థులు రాజకీయ ముసుగు వేసుకున్నారు" అని చంద్రబాబు విమర్శించారు.




## 'నా దుర్గ న్యాయం అడుగుతోంది'.. కోల్‌కతా వైద్యురాలి స్నేహితుడి ఆవేదన

'నా దుర్గ న్యాయం అడుగుతోంది.. నేను ఏ వేడుకా చేసుకోలేను'.. హత్యాచారానికి గురైన కోల్‌కతా వైద్యురాలి స్నేహితుడి వేదనకు అక్షరరూపం ఇది. తనతో జీవితం పంచుకుంటుందనుకున్న అమ్మాయి.. ఓ మృగాడి పైశాచికానికి బలైందని తెలిసి అతడి గుండె పగిలింది. ఆమె చనిపోయిందని తెలియగానే భవిష్యత్తుపై ఎన్నో ఆశలతో కట్టుకున్న అతడి కలల గూడు ఒక్క రాత్రిలో చెదిరిపోయింది. తన ఆవేదననంతా కవిత రూపంలో పంచుకుంటూ మిత్రురాలి మరణానికి న్యాయం కోసం గళమెత్తాడు. దేశవ్యాప్తంగా సంచలనం సృష్టించిన జూనియర్ వైద్యురాలిపై హత్యాచార ఘటనను నిరసిస్తూ కోల్‌కతాలో ఆందోళనలు కొనసాగుతున్నాయి. వీటిపై ఇటీవల పశ్చిమబెంగాల్ ముఖ్యమంత్రి మమతా బెనర్జీ చేసిన వ్యాఖ్యలు వివాదాస్పదమయ్యాయి. ఈ ఘటన జరిగి నెల రోజులు దాటిందని, ఇకనైనా ప్రజలు దాన్ని మరిచి దుర్గా పూజలకు సిద్ధం కావాలని ఆమె అన్నారు. ఈ క్రమంలోనే దీదీ వ్యాఖ్యలను నిరసిస్తూ ఆ వైద్యురాలి స్నేహితుడు ఓ కవిత రాశారు. దాన్ని ఓ ఆంగ్ల మీడియాతో పంచుకున్నారు. "నాడు ద్రౌపది వస్త్రాపహరణం జరిగినప్పుడు ద్రోణాచార్యుడు మౌనంగా ఉండిపోయాడు. నేడు శక్తిస్వరూపిణి కొలువైన నగరంలో ఓ దుర్గ (అమ్మాయి) న్యాయం కోసం విలపిస్తోంది. ఓ న్యాయ దేవతా.. నీ కళ్లకు ఇంకా ఆ గంతలేనా? న్యాయం కోసం ఈ నగరం (కోల్‌కతా) అర్థిస్తోంది. ఈ వేదన అనుభవించలేమని చెబుతోంది. నా 'దుర్గ' న్యాయం అడుగుతోంది. నేను వేడుక చేసుకోలేను" అని అతడు తన ఆవేదనను పంచుకున్నాడు. ఆగస్టు 9న కోల్‌కతాలోని ఆర్‌జీ కర్ మెడికల్ కాలేజీలో 31ఏళ్ల జూనియర్ వైద్యురాలు అత్యంత పాశవికంగా హత్యాచారానికి గురైన సంగతి తెలిసిందే. ఈ ఘటనతో ఆమె స్నేహితుడు తీవ్ర మానసిక వేదనకు లోనయ్యాడు. కౌన్సెలింగ్ తీసుకొని ఇప్పుడిప్పుడే ఆ బాధ నుంచి బయటకు వస్తున్న అతడు వైద్యురాలి మృతికి న్యాయం కోసం ఆమె కుటుంబంతో కలిసి పోరాడుతున్నాడు. ఒకే బ్యాచ్‌కు చెందిన వీరిద్దరూ త్వరలోనే పెళ్లి చేసుకోవాలనుకున్నట్లు తెలుస్తోంది.

## చంద్రబాబును ఇప్పుడు వరద బాధితులు దేవుడిలా కొలుస్తున్నారు




విజయవాడ: సత్యసాయి సేవా సెంట్రల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో వరద బాధితులకు నిత్యావసర వస్తువులను పంపిణీ చేశారు. ఏడు వేల మందికి బియ్యం, కందిపప్పు, పంచదార ఇతర వస్తువులను అందజేశారు. ఈ నేపథ్యంలో ఎంపీ కేశినేని శివనాథ్ చిన్ని, ఎమ్మెల్యే బోండా ఉమ, సత్యసాయి ట్రస్ట్ రత్నాకర్ ట్రాక్టర్లను ప్రారంభించారు. ఈ సందర్భంగా కేశినేని చిన్ని మాట్లాడుతూ.. ప్రభుత్వం తరఫున అనేక కార్యక్రమాలు చేశామన్నారు. అనేక స్వచ్ఛంద సంస్థలు బాధితులకు అండగా నిలిచాయన్నారు. సత్య సాయి సేవ సంస్థలు నిత్యవసర సరుకులు పంపిణీ చేయటం సంతోషంగా ఉందన్నారు. ప్రభుత్వం తరఫున వారికి ధన్యవాదాలు తెలిపారు. మొదటి రోజు నుంచే ఫుడ్ పంపిణీని ప్రారంభిస్తున్నట్టు కేశినేని చిన్ని వెల్లడించారు. మీరు చేస్తున్న సేవలు గుర్తుంచుకుంటామని.. సీఎం చంద్రబాబు కార్యదక్షత వల్లే నేడు ముంపు బాధితులు ఈ విపత్తు నుంచి గట్టెక్కారని కేశినేని చిన్ని అన్నారు. చంద్రబాబును ఇప్పుడు వరద బాధితులు దేవుడిలా కొలుస్తున్నారన్నారు. వరద పోయిన అనంతరం అవసరమైన సహాయక చర్యలు ప్రభుత్వం చేపట్టిందన్నారు. ఎమ్మెల్యే బొండా ఉమ మాట్లాడుతూ.. సత్యసాయి ట్రస్ట్ మానవ సేవే మాధవ సేవ అని నిరూపించారన్నారు. రెండున్నర కోట్ల విలువ చేసే సరుకులు పంపిణీ చేశారన్నారు. వారి సభ్యులు స్వయంగా బాధితులను కలిసి అందిస్తున్నారన్నారు. దాతలు మరింత మంది ముందుకు రావాలన్నారు. మొదటి రోజు నుంచే బాధితులకు అండగా నిలిచామన్నారు. బాధితులకు మరింత సేవ చేయాలని కోరుతున్నామని చంద్రబాబు అన్నారు. ప్రతి డివిజన్‌లో బాధితులకు సరుకులు అందిస్తున్నామన్నారు. ఈ నేపథ్యంలో సత్యసాయి ట్రస్ట్ నిర్వాహకులు రత్నాకర్ మాట్లాడుతూ.. విజయవాడలో వరద బాధితులకు తమ వంతు సహాయం అందించామన్నారు. 600 మంది సభ్యులు పాల్గొన్నారన్నారు. ప్రభుత్వం పరంగా కూడా అపారమైన సాయం అందించారన్నారు. దేశంలో ఎక్కడ విపత్తు వచ్చిన అక్కడ సేవా కార్యక్రమాలు చేస్తున్నామన్నారు. మా తరఫున సేవలు ప్రజలకు అందిస్తున్నామన్నారు. బుడమేరు బాధితులకు తొలి రోజు నుంచి ఆన్నీ ఇస్తున్నామన్నారు. ఏడు వేల మందికి నిత్యవసర సరుకులు ఇస్తున్నామన్నారు. 19 రకాల వస్తువులతో కిట్స్ అందిస్తున్నామన్నారు. వారు తమ తోబుట్టువులుగా భావించి అండగా ఉన్నామన్నారు. ప్రభుత్వం కూడా తమకు సూచనలు ఇస్తూ సహకరిస్తున్నారన్నారు. సీఎం చంద్రబాబుని కూడా సభ్యులు కలిశారన్నారు. ముఖ్యంగా ప్రజలు త్వరగా కోలుకోవాలని భగవంతుడిని కోరుకుంటున్నామన్నారు.




భారత్‌తో సత్సంబంధాల పునరుద్ధరణకు ముయిజ్జు సర్కారు దిద్దుబాటు చర్యలు చేపట్టినట్లు తెలుస్తోంది. అతి త్వరలోనే ఆయన న్యూదిల్లీ పర్యటన చేపట్టనున్నట్లు మంగళవారం ప్రకటించడానికి కొద్దిసేపటి ముందే ఇద్దరు కీలక మంత్రులు రాజీనామా చేశారు. గతంలో ఈ ఇద్దరు జూనియర్ మంత్రులను కేబినెట్ నుంచి సస్పెండ్ చేశారు. ఇక అధ్యక్షుడి పర్యటనకు సంబంధించిన షెడ్యూల్‌ను ఇరు దేశాల అధికారులు చర్చించి నిర్ణయించనున్నట్లు మాల్దీవులు తెలిపింది. గతేడాది నవంబరంలో ముయిజ్జు అధ్యక్షుడిగా అధికారం చేపట్టిన నాటి నుంచి భారత్–మాల్దీవుల సంబంధాలు క్షీణించాయి. కానీ, ఈ ఏడాది ప్రధాని మోదీ ప్రమాణస్వీకారానికి ఆయన హాజరుకావడంతో ఆ దేశ వైఖరిలో మార్పు వచ్చినట్లు సంకేతాలు వెలువడ్డాయి. గత నెల మన విదేశాంగ మంత్రి జైశంకర్ మాలేలో పర్యటించారు. ఆయన.. ముయిజ్జు, మాల్దీవుల విదేశాంగ మంత్రి మూసా జమీర్‌లతో భేటీ అయ్యారు. రక్షణ, వాణిజ్య, ఆర్థికశాఖల మంత్రులతోనూ సమాలోచనలు జరిపారు. ఈ పర్యటనలో ప్రధాని మోదీ తరఫున ముయిజ్జుకు జైశంకర్ శుభాకాంక్షలు తెలిపారు. మాల్దీవులకు భారత్ అందిస్తున్న అభివృద్ధి సాయానికి ముయిజ్జు కృతజ్ఞతలు తెలిపారు. ప్రధాని మోదీ లక్షద్వీప్ పర్యటనపై మాల్దీవుల మంత్రులు మల్షా షరీఫ్, మారియమ్ సిహునా మరో మంత్రి పలు అభ్యంతరకర వ్యాఖ్యలు చేశారు. అప్పట్లో ఈ ఘటన ఇరుదేశాల మధ్య సంబంధాలను తీవ్రంగా దెబ్బతీసింది. దీంతో నాడు ఆ దేశ విదేశాంగ శాఖ వీరి వ్యాఖ్యలతో విభేదించింది. తక్షణ చర్యల్లో భాగంగా వీరిని పదవి నుంచి సస్పెండ్ చేశారు. వీరిద్దరూ కేబినెట్‌లో డిప్యూటీ మినిస్టర్లు. ఈ వివాదం మాల్దీవుల పర్యటక రంగంపై పెను ప్రభావం చూపింది. గత ఏడాది ఏప్రిల్– జూన్ త్రైమాసికంలో 54,207 మంది భారతీయులు మాల్దీవుల్లో పర్యటించారు. ఈ ఏడాది అదే కాలంలో ఆ సంఖ్య 28,604కి పడిపోయింది. తాజాగా వారు పదవులకు రాజీనామా చేశారు. తమ వ్యక్తిగత కారణాలతో మంత్రి వర్గం నుంచి వైదొలుగుతున్నట్లు ప్రకటించారు.

## క్రేన్ ద్వారా బోట్స్ తొలగింపు అసాధ్యం.. నది లోపలికి వెళ్లి మరీ



అమరావతి : ప్రకాశం బ్యారేజ్ బోట్స్ తొలగింపు ప్రక్రియ క్లిష్టంగా మారింది. క్రేన్స్ ద్వారా బోట్స్ తొలగింపు అసాధ్యమని ఇరిగేషన్ అధికారులు చెబుతున్నారు. నది లోపలికి వెళ్లి ప్రకాశం బ్యారేజ్‌ను ఢీకొన్న బోట్స్‌ను కట్ చెయ్యాలి అధికారులు నిర్ణయించారు. మొత్తం నాలుగు బోట్లు ఒకదానికి ఒకటి గుద్దుకుని ఇరుక్కుపోవడంతో తొలగింపు చర్యలకు ఇబ్బందులు తలెత్తుతున్నాయి. విశాఖపట్నం, కాకినాడ నుంచి బోట్ కటింగ్ స్క్రూ డ్రైవర్స్‌ను బెకెం సంస్థ పిలిపించింది.

**అలా జరిగుంటే అంతా స్మశానమే...** మరోవైపు బోట్స్ ఢీకొన్న ప్రాంతాన్ని మంత్రి నిమ్మల రామానాయుడు పరిశీలించారు. బోట్ల తొలగింపు ప్రక్రియపై మంత్రి ఆరా తీశారు. అనంతరం ఏబీఎన్‌తో మంత్రి నిమ్మల మాట్లాడుతూ.. ఆధునిక టెక్నాలజీని ఉపయోగించి కౌంటర్ వెయిట్స్‌ను ఐదు రోజుల్లో మార్చగలిగామని తెలిపారు. వైసీపీ కుట్రను మాత్రం బద్దలు కొట్టడానికి కొంత సమయం పడుతుందన్నారు. భారీ క్రెయిన్స్ తీసుకొచ్చి బోర్డ్స్ తొలగించే ప్రక్రియ చేసామని. కానీ ఫలించలేదని తెలిపారు. ప్రకాశం బ్యారేజీకి భారీ డ్యామేజ్ చేయాలన్న ఉద్దేశంతోనే బోట్లకు లింక్ చేశారన్నారు. బోట్స్ కనుక సెంటర్ పిల్లర్‌ను ఢీకొని ఉంటే ప్రకాశం బ్యారేజ్‌తో పాటు కింది ప్రాంతం మొత్తం స్మశానంగా మారి ఉండేదన్నారు. విశాఖ, కాకినాడ నుంచి అండర్ వాటర్ డ్రైవర్స్ నిపుణులతో బోట్స్‌ను రెండు ముక్కలుగా చేసి వాటిని తీసే ప్రయత్నం చేస్తున్నామని తెలిపారు. కట్ చేసిన బోట్స్‌ను ఎయిర్ బెలూన్ సహాయంతో పైకి తీస్తామన్నారు. మరికొద్దిసేపట్లో ఆ ప్రక్రియ ప్రారంభమవుతుందని తెలిపారు. ఒక్కొక్క బోటు సుమారు 30 టన్నుల బరువు ఉండటంతో అవి తొలగించడం కష్ట సాధ్యంగా మారుతోందన్నారు. బోట్లకు ఒక దానికి ఒకటి గొలుసు వేయడంతో కౌంటర్ వెయిట్స్‌ను గుద్దుకుని నీటి లోపలికి రెండు.. నీటిపై భాగంలో రెండు బోట్స్ ఉన్నాయని మంత్రి నిమ్మల రామానాయుడు వెల్లడించారు.

## ఏపీలో వరద నష్టంపై కేంద్ర బృందం అధ్యయనం.. శాఖల వారీగా వివరించిన అధికారులు



అమరావతి: ఏపీలో భారీ వర్షాలు, వరదల నష్టంపై కేంద్రవ బృందం అధ్యయనం ప్రారంభించింది. ఇప్పటికే వరద నష్టంపై అధికారులు ప్రాథమిక నివేదిక రూపొందించారు. వరద పరిస్థితి, జరిగిన నష్టానికి సంబంధించి తాడేపల్లిలోని విపత్తు నిర్వహణ సంస్థ కార్యాలయంలో వివిధ శాఖల అధికారులతో కేంద్ర బృందం సమావేశమైంది. శాఖల వారీగా జరిగిన నష్టాన్ని అధికారులు వివరించారు. భారీ వర్షాలు, వరదల కారణంగా 7 జిల్లాలు ప్రభావితమయ్యాయని కేంద్ర బృందానికి అధికారులు తెలిపారు. ఎన్టీఆర్, కృష్ణా, గుంటూరు, బాపట్ల, పల్నాడు, ఏలూరు, పశ్చిమగోదావరి జిల్లాల్లో ప్రభావం ఉందని వివరించారు. బుడమేరు కారణంగా ముంపునకు గురైన విజయవాడ నగరం పరిస్థితిని వివరించారు. రాష్ట్ర ప్రభుత్వం చేపట్టిన వరద సహాయక, పునరావాస చర్యలపై నివేదిక అందజేశారు. వరదలు, భారీ వర్షాల ధాటికి 32 వార్డులు, 161 సచివాలయాల పరిధిలోని ప్రజలు ఇబ్బందులు పడ్డారని తెలిపారు. ఎన్డీఆర్ఎఫ్, ఎస్డీఆర్ఎఫ్, నౌకాదళం, వాయుసేన హెలికాప్టర్లతో సహాయక చర్యలు చేపట్టామని వివరించారు. త్వరితగతిన విద్యుత్ పునరుద్ధరించామని, పారిశుద్ధ్య పనులు చేపట్టామన్నారు. డ్రోన్లు, హెలికాప్టర్ల ద్వారా బాధిత ప్రజలకు ఆహారం, తాగునీరు, పాలు, బిస్కెట్ ప్యాకెట్స్ పంపిణీ చేశామన్నారు. భారీగా వ్యవసాయ, ఉద్యాన పంటలకు నష్టం వాటిల్లిందని తెలిపారు. వరద ప్రభావిత ప్రాంతాల వీడియోలను, ఫొటోలను కేంద్ర బృందం ఎదుట అధికారులు ప్రదర్శించారు.

## పెరుగుతున్న గోదావరి వరద... పలు గ్రామాలు జలదిగ్బంధం

ఏలూరు, సెప్టెంబర్ 11: ఏపీలో గోదావరి మహోగ్రరూపం దాల్చుతోంది. భారీ వర్షాలతో గోదావరి వరద ఉధృతి అంతకంతకూ పెరుగుతూనే ఉంది. జిల్లాలోని కుక్కునూరు, వేలేరుపాడు మండలాల్లో గోదావరి వరద పెరుగుతోంది. వేలేరుపాడు మండలం రుద్రంకోటతో పాటు పలు గ్రామాలు జల దిగ్బంధంలో ఉన్నాయి. వెంటనే అప్రమత్తమైన అధికారులు.. ముంపు వాసులను దాచారంలోని పునరావాస కేంద్రాలకు అధికారులు తరలించారు. గోదావరి, శబరి నదులకు వరద పోటు ఉండటంతో గంట గంటకు పెరుగుతున్న వరదతో ముంపు ప్రాంత ప్రజలు తీవ్ర భయాందోళనకు గురవుతున్నారు. మరోవైపు గోదావరి ఉధృతంగా ప్రవహిస్తుండటంతో ధవళేశ్వరం కాటన్ బ్యారేజ్ వద్ద రెండో ప్రమాద హెచ్చరికను జారీ చేశారు. గంట గంటకూ గోదావరి వరద ప్రవాహం పెరుగుతోంది. ఎగువ ప్రాంతాల నుంచి భారీగా వరద నీరు గోదావరిలో కలుస్తోంది. బ్యారేజ్ వద్ద నీటి మట్టం 14.20 అడుగులకు పెరిగింది. బ్యారేజ్‌కు చెందిన 175 గేట్లు పూర్తిగా ఎత్తివేసి నీటిని దిగువకు విడుదల చేస్తున్నారు. బ్యారేజ్ నుంచి 13.27 లక్షల క్యూసెక్కులు వరద నీరు దిగువకు విడుదల చేయడం జరుగుతోంది. పాపికొండల విహార యాత్ర తాత్కాలికంగా అధికారులు నిలిపివేశారు. గోదావరి వరద నేపథ్యంలో తూర్పుగోదావరి, అల్లూరి, అంబేద్కర్ కోనసీమ జిల్లాల కలెక్టర్లు అప్రమత్తమయ్యారు. అల్లూరి జిల్లాలోని విలీన మండలాల్లో శబరి, సీలేరు ఉపనదులతో పాటు వాగులు పొంగి ప్రవహిస్తున్నాయి.



భద్రాచలం–కూనవరం మధ్య రాకపోకలు నిలిచిపోయాయి. పాఠశాలలుకు సెలవులు ప్రకటించారు. మూడు రోజుల నుంచి ఆర్టీసీ బస్సు రాకపోకలు నిలిచిపోయాయి. కూనవరంలో శబరి, గోదావరి సంగమం వద్ద ఉన్న వంతెనను వరద నీరు తాకింది. సోకిలేరు, చంద్రవంక, చీకటివాగు, కుయుగూరు వాగులు పొంగి ప్రవహిస్తున్నాయి. చింతూరు మండలంలో 22 గ్రామాలు జలదిగ్బంధంలో ఉన్నాయి. వీఆర్ పురం మండలం మండలంలోని ప్రధాన రహదారులపై ప్రవహిస్తున్న వరద నీరు ప్రవహిస్తోంది. దీంతో 30 గ్రామాలకు రాకపోకలు నిలిచిపోయారు.

## ఏలేరు వరద ఉధృతిపై డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్ సమీక్ష



అమరావతి: ఏలేరు వరద ఉధృతిపై కాకినాడ కలెక్టర్, అధికారులతో ఉప ముఖ్యమంత్రి పవన్ కల్యాణ్ సమీక్ష నిర్వహించారు. వరద పరిస్థితిపై ఫోనులో వివరాలు తెలుసుకున్నారు. కాకినాడ జిల్లా వ్యాప్తంగా 62 వేల ఎకరాల పంట నష్టం జరిగిందని అధికారులు తెలిపారు. గండ్లు పడి రోడ్లపై నీటి చేరికతో రాకపోకలకు అంతరాయం కలిగిందన్నారు.

ఏలేరు వరద ఉధృతి క్రమంగా తగ్గుముఖం పడుతోందని డిప్యూటీ సీఎంకు కలెక్టర్ వివరించారు. వరద ప్రభావిత ప్రాంతాల్లో ఆహారం, నీరు, పాలు అందించాలని పవన్ ఆదేశించారు.

**కిర్లంపూడి మండలంలో తీవ్ర నష్టం :** కాకినాడలో ఏలేరు వరద క్రమంగా తగ్గుతోంది. పలుచోట్ల ఇళ్లు ఇంకా జల దిగ్బంధంలోనే ఉన్నాయి. ఏలేశ్వరం, జగ్గంపేట, కిర్లంపూడి, గొల్లప్రోలు మండలాల్లో పంటలు నీటమునిగాయి. పిఠాపురం, పెద్దాపురం, సామర్లకోట మండలాల్లో పంట నష్టం జరిగింది. జిల్లాలో అత్యధికంగా కిర్లంపూడి మండలంలో తీవ్ర పంట నష్టం జరిగినట్లు అధికారులు తెలిపారు. కిర్లంపూడి మండలం భూపాలపట్నంలో వరదలో సుబ్బారావు అనే వ్యక్తి గల్లంతయ్యాడు. అతని ఆచూకీ కోసం గాలింపు చేపట్టారు. మరోవైపు పోలవరం ప్రాజెక్టుకు గోదావరి వరద పెరుగుతోంది. స్పిల్‌వే ఎగువన 33.64 మీటర్లు, దిగువన 25.25 మీటర్ల నీటిమట్టం నమోదైంది. 48 గేట్ల ద్వారా 12,20,318 క్యూసెక్కుల గోదావరి వరదను దిగువకు విడుదల చేస్తున్నారు.

# శ్రీలీల అందం హిందోళం

తనదైన అందం ప్రతిభతో అందరి దృష్టిని ఆకర్షించింది శ్రీలీల. ఈ తెలుగమ్మాయి కెరీర్ పరంగా ఫుల్ స్వింగ్ లో ఉంది. పెద్ద హీరోలతో సినిమాలు ఫ్లాపులైనా కానీ, శ్రీలీల ప్రతిభను గుర్తించి దర్శకనిర్మాతలు వరుసగా సినిమాల్లో అవకాశాలు కల్పిస్తున్నారు. ఇక సోషల్ మీడియాల్లోను ఈ బ్యూటీ ప్రత్యేకించి ఫాలోవర్స్ ని సంపాదించుకుంది. వారి కోసం శ్రీలీల హాట్ ఫోటోషూట్ లను షేర్ చేస్తుంది. తాజాగా శ్రీలీల పర్పుల్ కలర్ డిజైనర్ డ్రెస్ లో ఫోజులిచ్చిన ఓ ఫోటోగ్రాఫ్ అంతర్జాలంలో వైరల్ గా మారింది. శ్రీలీల కెరీర్ జర్నీ ఆసక్తికరం. ప్రస్తుతం యూత్ స్టార్ నితిన్ సరసన %–%రాబిన్



హుడ్%–% చిత్రంలో నటిస్తోంది. ఈ సినిమా తర్వాత కూడా అవకాశాలున్నాయి. దిగ్గజ దర్శకుడు డేవిడ్ దావన్‌తో శ్రీలీల ఓ హిందీ సినిమలో నటించాల్సి ఉంది. కానీ రకరకాల కారణాలతో ఇది కుదరలేదు. మేకర్స్ శ్రీలీలకు మొదట ఈ చిత్రాన్ని ఆఫర్ చేశారు. కానీ తనకు డేట్స్ లేకపోవడంతో సినిమా నుండి తప్పుకుంది. మహేష్ – రవితేజ లాంటి పెద్ద హీరోలతో ఆఫర్లు తనకు పెద్ద విజయాలను అందిస్తాయని ఆశించింది. కానీ అవన్నీ ఫ్లాపులయ్యాయి. ఇప్పుడు నితిన్ తో తాజా చిత్రాన్ని శ్రీలీల అత్యంత ప్రతిష్ఠాత్మకంగా భావిస్తోంది. నితిన్ ఎనర్జీకి తగ్గట్టుగా శ్రీలీల డ్యాన్సులతో ఆకట్టుకోగలదు.

## జెర్సీ హీరోయిన్.. బిజీగా ఉన్నా సౌండ్ లేదేంటి?


తెలుగులో జెర్సీ సినిమాలో నానికి జోడీగా నటించిన శ్రద్ధా శ్రీనాథ్ ని అంత ఈజీగా ఎవరు మరిచిపోరు. ఈ కన్నడ బ్యూటీ జెర్సీ చిత్రంలో అద్భుతమైన పెర్ఫార్మెన్స్ తో ఆకట్టుకుంది. అమ్మడు కోహినూర్ అనే మలయాళం మూవీతో నటిగా కెరియర్ స్టార్ట్ చేసింది. అయితే కన్నడంలో చేసిన యూటర్న్ శ్రద్ధా శ్రీనాథ్ కి మంచి బ్రేక్ ఇచ్చింది. ఈ సినిమా తర్వాత కన్నడ, మలయాళీ, తమిళ్ భాషలలో వరుస అవకాశాలు అందుకుంది. జెర్సీ సినిమాతో తెలుగులోకి ఈ బ్యూటీ ఎంట్రీ ఇచ్చింది. ఈ సినిమాలో శ్రద్ధా శ్రీనాథ్ తన పెర్ఫార్మెన్స్ తో విమర్శకుల ప్రశంసలు సొంతం చేసుకుంది. ఆ తరువాత తెలుగులో చెప్పుకోదగ్గ స్థాయిలో అవకాశాలు సొంతం చేసుకోలేకపోయింది. ఆది సాయికుమార్ తో జోడీ అనే సినిమాలో నటించింది. తరువాత సిద్ధూ జొన్నలగడ్డ కృష్ణ అండ్ హిస్ లీల సినిమాలో ఒక హీరోయిన్



గా కనిపించింది. తెలుగులో చెప్పుకోదగ్గ అవకాశాలు రాకపోయిన కూడా శ్రద్ధా శ్రీనాథ్ తమిళ్, కన్నడ భాషలలో మాత్రం వరుస సినిమాలు చేస్తోంది. గత ఏడాది తమిళంలో వచ్చిన ఇరంగపట్రు సినిమా సూపర్ సక్సెస్ అయ్యింది. చిన్న సినిమాగా వచ్చి పెద్ద విజయాన్ని అందుకుంది. ఈ ఏడాది సైంధవ్ మూవీలో వెంకటేష్ కి జోడీగా శ్రద్ధా శ్రీనాథ్ కనిపించింది. అయితే ఈ మూవీ డిజాస్టర్ అయ్యింది. త్వరలో మెకానిక్ రాకీ సినిమాతో ప్రేక్షకుల రాబోతోంది. మంచి టాలెంటెడ్ యాక్టర్ గా పేరున్న కూడా తెలుగులో మాత్రం ఆమె కమర్షియల్ హీరోయిన్ గా మాత్రం సక్సెస్ కాలేకపోయింది. అయితే సౌత్ లో మంచి టాలెంటెడ్ యాక్టర్స్ గా పేరు తెచ్చుకున్న వారిలో శ్రద్ధా శ్రీనాథ్ కూడా ఉంటుందని చెప్పొచ్చు. గ్లామర్ బేస్డ్ రోల్స్ మాత్రం చేయలేదు. కథలు కూడా సెలక్టివ్ గా ఎంపిక చేసుకుంటుంది. కచ్చితంగా తన పాత్రకి ప్రాధాన్యత ఉంది అనుకుంటేనే ఆమె ఒప్పుకుంటుంది. మేగ్జిమమ్ ఆమె నటించిన సినిమాలలో చాలావరకు డీసెంట్ రోల్స్ ఉంటాయి. అయితే ఆమె ఏదో ఒక సినిమాతో బిజీగా ఉన్నప్పటికీ బిగ్ సక్సెస్ అయితే ఇంతవరకు రాలేదు. చేసిన సినిమాలు తక్కువే అయిన కూడా నటిగా మాత్రం శ్రద్ధా శ్రీనాథ్ బలమైన ముద్ర వేసుకుంది. సినిమాలో చేసే పాత్రలకి పూర్తి భిన్నంగా బయట ఈ బ్యూటీ గ్లామర్ అవుట్ ఫిట్ లతో ఇన్ స్టాగ్రామ్ లో సందడి చేస్తూ ఉంటుంది. ఇక ప్రస్తుతం అమ్మడి హోప్స్ అన్ని కూడా విశ్వక్ సేన్ మేకనిక్ రాఖీ సినిమాపైనే ఉన్నాయి. ట్రయాంగిల్ లవ్ స్టోరీగా రానున్న ఈ సినిమాపై ఆడియెన్స్ లో మంచి బజ్ ఉంది. కాబట్టి కమర్షియల్ గా క్లిక్కయ్యే అవకాశం ఉంది. మరి ఈ సినిమాతో అయినా జెర్సీ బ్యూటీ రాత మారుతుందేమో చూడాలి.




# సౌత్ హీరోలతో ధావన్ బోయ్ మల్టీస్టారర్ చేయడా?




వరుణ్ ధావన్ నటించిన తాజా సినిమా 'బేబీ జాన్' 25 డిసెంబర్ 2024న విడుదల కానుంది. ఎ. కాళీశ్వరన్ దర్శకత్వం వహించిన ఈ యాక్షన్ డ్రామాలో కీర్తి సురేష్ – వామికా గబ్బి కథానాయికలుగా నటించారు. ఇటీవలి ఇంటర్వ్యూలో చిత్ర నిర్మాత జ్యోతి దేశ్‌పాండే వరుణ్ ధావన్ మునుపెన్నడూ చూడని నటనను ప్రదర్శించాడని, బేబీ జాన్ అందరి మనసులను చెదరగొడుతుందని పేర్కొన్నారు. ఈ చిత్రం ఫ్రాంచైజీగా మారే అవకాశం ఉందని ఆమె వెల్లడించింది. సీక్వెల్‌గా కాదు.. పాత్ర ఆధారిత ఫ్రాంచైజీగా మారుతుందని తెలిపారు. 1నవంబర్ 2024న విడుదలవుతున్న సింగమ్ ఎగైన్ ప్రింట్‌లకు బేబీ జాన్ ప్రచార చిత్రాన్ని జోడిస్తారని జ్యోతి దేశ్‌పాండే ధృవీకరించారు. అట్లీ – జియో స్టూడియోస్ సమర్పకులుగా ఏ ఫర్ యాపిల్ స్టూడియోస్ – సినీ 1 స్టూడియోస్ బ్యానర్‌లపై నిర్మించిన ఈ చిత్రానికి థమన్ సంగీతం అందించారు. బాలీవుడ్ యువహీరో వరుణ్ ధావన్ ప్రస్తుతం పాన్ ఇండియా మార్కెట్ ని ఏలాలని కలలు గంటున్నాడు. అయితే ఇంతకుముందు అతడు చేసిన ప్రయత్నం అంతంత మాత్రం ఫలితాన్నే ఇచ్చింది. మునుముందు అతడు ప్రయోగాత్మక కథాంశాలు, సౌత్ డైరెక్టర్లతో పని చేసేందుకు ఆసక్తిగా ఉన్నాడు. కానీ దానికి సమయం పడుతుందని సమాచారం. ప్రస్తుతం సౌత్ – నార్త్ కాంబోలో మల్టీస్టారర్ల ట్రెండ్ ఊపందుకుంది. ఇదే హుషారులో వరుణ్ ధావన్ తెలుగు, తమిళ హీరోలతో కలిసి నటిస్తాడేమో చూడాలి.

# దళపతి కెరీర్ గ్రేటెస్ట్ డిజాస్టర్?




విజయ్ నటించిన యావరేజ్ సినిమాని కూడా తమిళ తంబీలు పెద్ద హిట్టు చేస్తారు. అయితే అతడి పప్పులు తమిళనాడులో ఉడుకుతాయి. కానీ తెలుగులో కాదు. ఇక్కడ యథావిధిగా దళపతి నటించిన GOAT (ది గ్రేటెస్ట్ ఆఫ్ ఆల్ టైమ్) బిగ్ ఫ్లాప్ గా నిలిచిందని ట్రేడ్ విశ్లేషిస్తోంది. ప్రీబిజినెస్ ప్రకారం.. తెలుగు రాష్ట్రాల్లో 20 కోట్లు అంతకుమించి వసూలు చేయాల్సి ఉండగా, కనీసం కోటి లోపు షేర్ తెస్తుందని ట్రేడ్ వర్గాలు చెబుతున్నాయి. ఈ ఫలితం ఊహించనిది. అసలు థియేటర్లలో హుషారు అన్నదే లేదు. విజయ్ గత చిత్రాలు మాస్టర్, అదిరింది, వారసుడు, లియో తెలుగు పంపిణీదారులకు ఓ మోస్తరు లాభాల్ని అందించాయి. బీస్ట్ యావరేజ్ గా ఆడింది. కానీ GOAT చెత్తగా ఉందని ట్రేడ్ చెబుతోంది. విజయ్ కెరీర్ లో బిగ్గెస్ట్ ఫ్లాప్ గోట్. అయితే తెలుగులో ఫలితం ఇలా ఉంటే, అటు తమిళంలో బాగానే ఆడుతోందని సమాచారం. ఓవర్సీస్ లోను ఫర్వాలేదనే టాక్ వినిపిస్తోంది. అయితే తెలుగులో ఇంత పెద్ద ఫ్లాపవ్వడానికి కారణం.. ఈ సినిమాకి సరైన ప్రమోషన్స్ లేకపోవడం, కంటెంట్ పరంగా రొటీనిటీ అన్న విమర్శలు వినిపిస్తున్నాయి. మ్యూజిక్ కూడా ప్రభావం చూపలేదు. ఈ సినిమా ట్రైలర్ కానీ, పాటలు కానీ ఇక్కడ ఎవరికీ నచ్చలేదు. దాంతో అంతగా బజ్ క్రియేట్ కాలేదు.

సరైన ప్రచారం లేని సినిమాకి తెలుగు రాష్ట్రాల్లో వసూళు దక్కడం అంత సులువు కాదని చాలాసార్లు ప్రూవ్ అయింది. మరోవైపు తెలుగు రాష్ట్రాల్లో భారీ వర్షాల కారణంగా కూడా జనం థియేటర్ల వైపు వెళ్లడం లేదని అంచనా వేస్తున్నారు.

## వారికి ప్రత్యేక స్థానం! మలైకా పోస్ట్ ఎవరినుద్ధేశించి?

చాలా కాలంగా రిలేషన్‌షిప్‌లో ఉన్న అర్జున్ కపూర్ – మలైకా అరోరా జంట విడిపోయారని ఇటీవల కథనాలొచ్చిన సంగతి తెలిసిందే. వారి రిలేషన్ స్టాటస్ గురించి రకరకాలుగా పుకార్లు షికార్ చేస్తున్నాయి. ఇలాంటి సమయంలో మలైకా ఇటీవల తన ఇన్‌స్టా కథనంలో ఒక రహస్య పోస్ట్‌ను షేర్ చేసారు. దాని సారాంశం ఇలా ఉంది. "మీ ఆనందంలో పాలుపంచుకునే వారి పట్ల శ్రద్ధ వహించండి.. మీ బాధను అనుభవించండి.. వారు మీ హృదయంలో ప్రత్యేక స్థానానికి నిజంగా అర్హులు" అని పోస్ట్‌లో ఉంది.. మలైకా ఎవరి పేరును దీనికి జత చేయలేదు. క్యాప్షన్‌ను చేర్చలేదు. కానీ అర్జున్ కపూర్ నుంచి విడిపోయిందనే పుకార్ల కారణంగా మలైకా పేరు చర్చనీయాంశంగా మారింది. అంతకుముందు మలైకా అరోరా గత నెలలో అర్జున్ పుట్టినరోజు వేడుకలు అతడి నివాసంలో సెలబ్రేట్ చేయగా వాటికి స్కిప్ చేసింది. ఇది బ్రేకప్ పుకార్లకు ఆజ్యం పోసింది. మలైకా బర్త్ డే



వేడుకలను అర్జున్ స్కిప్ కొట్టాడు. ఈ రెండు సందర్భాలు సందేహాలను రాజేసాయి. తన బ్రేకప్ గురించిన చర్చ పేరుతో ఆన్ లైన్ లో ఎలాంటి ప్రతికూలతను వ్యాప్తి చేసారో చెబుతూ మలైకా కలతకు గురైంది. గతంలో హలో మ్యాగజైన్‌కి ఇచ్చిన ఇంటర్వ్యూలో ఇంటర్నెట్ విషపూరిత స్వభావం గురించి మలైకా వెల్లడించింది. నేను ఒక మెకానిజం లేదా షీల్డ్‌ను అభివృద్ధి చేసాను.. ఇక్కడ ప్రతికూలత నన్ను ప్రభావితం చేయనివ్వదు! అని మలైకా వెల్లడించింది. నేను పని చేసే చోట.. సోషల్ మీడియా లేదా ట్రోల్‌లు అన్నిటి నుండి నన్ను రక్షించుకున్నాను. నేను ఆ ప్రతికూల శక్తిని తెలుసుకున్న మరుక్షణం వాటికి దూరంగా ఉంటాను. ఇది నేను కాలక్రమేణా నేర్చుకున్న నైపుణ్యం. గతం.. అది నన్ను ప్రభావితం చేస్తుంది. ప్రభావితం చేయదని చెబితే అది అబద్ధం. నేను మనిషిని.. ఏడుస్తాను.. బ్రేక్ అవుతాను. ట్రోలింగ్ జరిగినప్పుడు అన్ని భావోద్వేగాలను అనుభవిస్తాను... కానీ మీరు నేను ఎలా ఉన్నానో పబ్లిక్‌గా చూడలేరు..! అని అన్నారు. మలైకా– అర్జున్ 2018లో డేటింగ్ ప్రారంభించారు. ఇద్దరూ తమ రిలేషన్ షిప్ గురించి పెద్దగా బహిరంగంగా చర్చించకపోయినా వెకేషన్ల నుంచి ఫోటోలు, వీడియోలను షేర్ చేసారు. అలాగే ఒకరికొకరు పుట్టినరోజులు సెలబ్రేట్ చేసారు. కానీ అవేవీ ఇప్పుడు లేవు. కెరీర్ మ్యాటర్ కి వస్తే.. అర్జున్ విలన్‌గా నటించిన సింగం ఎగైన్ విడుదలకు సిద్ధమవుతోంది. అజయ్ దేవగన్, దీపికా పదుకొణె, టైగర్ ష్రాఫ్, రణ్‌వీర్ సింగ్ , అక్షయ్ కుమార్ తదితరులు నటించిన ఈ చిత్రం దీపావళికి ప్రేక్షకుల ముందుకు రానుంది. మలైకా బుల్లితెర రియాలిటీ షోలు, ప్రకటనల ద్వారా భారీగా ఆర్జిస్తోంది.

## డింపుల్ హయాతి.. లెగ్స్ అందాలతో క్రేజీ లుక్

టాలీవుడ్ లో గ్లామరస్ హీరోయిన్ గా తనకంటూ ప్రత్యేకమైన ఇమేజ్ సొంతం చేసుకున్న తెలుగమ్మాయి డింపుల్ హయాతి. ఈ బ్యూటీ గల్ఫ్ అనే సినిమాతో హీరోయిన్ గా కెరియర్ స్టార్ట్ చేసింది. అయితే మొదటి చిత్రం ఆశించిన స్థాయిలో సక్సెస్ ఇవ్వలేదు. తరువాత తమన్నా, ప్రభుదేవా కాంబినేషన్ లో వచ్చిన అభినేత్రి2 సినిమాలో కీలక పాత్రలో కనిపించింది. ఆ మూవీ కూడా పెద్దగా వర్క్ అవుట్ కాలేదు. గద్దలకొండ గణేష్ సినిమాల డింపుల్ హయాతి చేసిన ఐటెం సాంగ్ సూపర్ హిట్ కావడంతో ఒక్కసారిగా పాపులర్ అయ్యింది. ఆ సాంగ్ తర్వాత యురేకా అనే మూవీలో హీరోయిన్ గా చేసింది. బాలీవుడ్ లో అక్షయ్ కుమార్ అత్రాంగి రే సినిమాతో హిందీలోకి డింపుల్ హయాతి అడుగుపెట్టింది. తమిళంలో విశాల్ కి జోడీగా ఒక సినిమాలో నటించింది. తరువాత మాస్



మహారాజ్ రవితేజకి జోడీగా ఖిలాడీ చిత్రంలో ఆడిపాడింది. ఈ మూవీలో డింపుల్ హయాతి బికినీ వేసుకొని అందరికి షాక్ ఇచ్చింది. ఈ బికినీ ట్రీట్ తో గ్లామర్ రోల్స్ కి తాను సిద్ధమనే సిగ్నల్స్ ఇచ్చింది. నెక్ట్స్ రామబాణం సినిమాలో గోపిచంద్ కి జోడీగా నటించే అవకాశం డింపుల్ హయాతికి వచ్చింది. ఈ చిత్రంలో ఆమె మంచి ఫన్ జెనరేట్ చేసే పాత్రలో కనిపించింది. ఈ మూవీ కమర్షియల్ గా డిజాస్టర్ కావడంతో డింపుల్ హయాతి పెద్దగా ఎవరి దృష్టిని ఆకర్షించలేదు. అయితే కమర్షియల్ హీరోయిన్ అయ్యే ఫీచర్స్ డింపుల్ హయాతి దగ్గర పుష్కలంగా ఉన్నాయని ఆమె ఫ్యాన్స్ అంటూ ఉంటారు.

ఇన్ స్టాగ్రామ్ లో డింపుల్ రెగ్యులర్ గా తన గ్లామర్ పిక్స్ ని షేర్ చేస్తూ ఉంటుంది. ఈ ఫోటోలు సోషల్ మీడియాలో వైరల్ అవుతాయి. ఇదిలా ఉంటే తాజాగా డింపుల్ హయాతి వైట్ కలర్ టీషర్టుతో డిఫరెంట్ ఫోజులు ఇస్తూ ఆకట్టుకుంది. ఈ ఫోటోలకి నెటిజన్లు ఫిదా అయిపోతున్నారు. కళ్ళతోనే డింపుల్ హయాతి కట్టిపడేస్తోందని నెటిజన్లు కామెంట్స్ చేస్తున్నారు.




## ఆక్రమణలు వదిలి గౌరవంగా తప్పుకోండి: సీఎం రేవంత్‌రెడ్డి

హైదరాబాద్: కొందరు పెద్దలు ప్రాజెక్టుల వద్ద ఫాంహౌస్‌లు కడుతున్నారని సీఎం రేవంత్‌రెడ్డి అన్నారు. తెలంగాణ పోలీసు అకాడమీలో నిర్వహించిన పాసింగ్ అవుట్ పరేడ్‌లో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొని మాట్లాడారు. "ఫాంహౌస్‌ల నుంచి నుంచి వచ్చే డ్రైనేజీని గండిపేటలో కలుపుతున్నారు. నాలాల ఆక్రమణలతో ఉప్పెనలా వరదలు వస్తున్నాయి. దీంతో పేదల ఇళ్లు మునుగుతున్నాయి. చెరువులను ఆక్రమణల నుంచి విడిపించేందుకే హైడ్రాను ఏర్పాటు చేశాం. ఆక్రమణలు వదిలి గౌరవంగా తప్పుకోండి. వాటిని కూల్చే బాధ్యత తీసుకుంటాం. కూల్చివేతలపై స్టే తెచ్చుకున్నా.. కోర్టుల్లో కొట్లాడతాం. హైదరాబాద్ కాలుష్యం నల్గొండకు చేరుతోంది. ఆక్రమణలు తొలగించి మూసీ రివర్ ఫ్రంట్ అభివృద్ధి చేస్తాం. ఇక్కడి పరివాహక ప్రాంతంలో పేదల ఆక్రమణలు ఉన్నాయి. వారి పట్ల ప్రభుత్వం మానవతా ధోరణితో వ్యవహరిస్తుంది. మూసీ వెంట ఉన్న 11 వేల మంది బాధితులకు డబుల్ బెడ్‌రూం ఇళ్లు ఇస్తాం.

**టీజీపీఎస్సీపై నిరుద్యోగులకు ఎలాంటి అనుమానాలు లేవు :** గత ప్రభుత్వ హయాంలో ప్రజల ఆకాంక్షలు నెరవేరలేదు. తెలంగాణలో డిసెంబర్ 3న ప్రజాపాలన ఆవిర్భవించింది. కాంగ్రెస్ వచ్చాక 30 వేలకు పైగా ఉద్యోగాలు కల్పించాం. మరో 35 వేల ఉద్యోగాలకు నోటిఫికేషన్లు ఇచ్చాం. టీజీపీఎస్సీపై నిరుద్యోగులకు ఎలాంటి అనుమానాలు లేవు. గతంలో ఉద్యోగ నోటిఫికేషన్ల కోసం ఎదురు చూసే పరిస్థితి. ప్రస్తుత ప్రభుత్వం నోటిఫికేషన్లు వరుసగా ఇస్తోంది. నిరుద్యోగుల వినతి ప్రకారం గ్రూప్-2 పరీక్షలు వాయిదా వేశాం. సైబర్, గంజాయి నేరాలను ఉక్కుపాదంతో అణచివేయాలి. త్యాగాలతో సాధించుకున్న తెలంగాణలో వ్యసనాలకు తావు లేదు. కులవృత్తులతో పాటు చేతి వృత్తులను బలోపేతం చేస్తున్నాం. వ్యవసాయం దండగ కాదు.. పండగ అని నిరూపించాం. రైతులు ఆత్మగౌరవంతో తల ఎత్తుకునేలా ప్రభుత్వ నిర్ణయాలు ఉన్నాయి" అని రేవంత్‌రెడ్డి తెలిపారు.

**నేరం జరగకుండా చూడటం ముఖ్యం: డీజీపీ జితేందర్ :** శాంతి భద్రతలు, ప్రజలకు న్యాయం చేయడంలో ఎస్సైల పాత్ర కీలకమని డీజీపీ జితేందర్ తెలిపారు. నేరం జరిగినప్పుడు మాత్రమే స్పందించడం పోలీసుల పాత్ర కాదు, నేరం జరగకుండా చూడటం ముఖ్యమన్నారు. మారుతున్న సాంకేతికత ఆధారంగా అప్డేట్ అవుతూ ఉండాలని చెప్పారు. బృందంగా పనిచేసి ముందుకు వెళ్లాలని, ప్రజల నమ్మకం పొందాలని సూచించారు.

సైబర్ నేరాల కట్టడిలో తెలంగాణ పోలీసులకు ప్రతిష్ఠాత్మక అవార్డు రావడంతో చాలా ఆనందంగా ఉందని తెలిపారు.






## తెలంగాణ సీఎం రేవంత్‌రెడ్డితో పవన్‌కల్యాణ్ భేటీ

హైదరాబాద్: తెలంగాణ సీఎం రేవంత్‌రెడ్డితో ఏపీ డిప్యూటీ సీఎం పవన్‌కల్యాణ్ భేటీ అయ్యారు. జూబ్లీహిల్స్‌లోని రేవంత్ నివాసానికి పవన్ వెళ్లారు.

రాష్ట్రంలోని వరద బాధితుల సహాయార్థం రూ.కోటి విరాళాన్ని ఇటీవల పవన్ ప్రకటించారు. దానికి సంబంధించిన చెక్కును నేడు సీఎంకు ఆయన అందజేశారు. అనంతరం ఇరు రాష్ట్రాల మధ్య సత్సంబంధాలు, ఇతర అంశాలపై వారి మధ్య చర్చ జరిగినట్లు సమాచారం.

## ప్రభుత్వ ఆసుపత్రుల్లో మందుల కొరత



నల్గొండ, సెప్టెంబర్ 11: ప్రభుత్వ ఆసుపత్రుల్లో మందుల కొరతతో పాటు సిబ్బంది సమస్యలు బాగా ఉన్నాయని ఎంపీ ఈటెల రాజేందర్ అన్నారు. బుధవారం నల్గొండ బీజేపీ కార్యాలయంలో మీడియాతో ఎంపీ మాట్లాడుతూ.. వరుస వర్షాలతో వైరల్ ఫీవర్స్ వ్యాపిస్తున్నాయని.. గ్రామాలకు వైరస్ పాకుతోందన్నారు. రోగులతో ప్రైవేట్ ఆసుపత్రులు కిటకిట లాడుతున్నాయన్నారు. నిరంతరాయంగా వైద్య సిబ్బంది పని చేస్తేనే ప్రజల సమస్యలకు పరిష్కారం ఏర్పడుతుందని తెలిపారు. డయాగ్నస్టిక్ సెంటర్లలో కిట్స్ కొరత ఉందన్నారు. ప్రభుత్వం ప్రజారోగ్యంపై ప్రత్యేక దృష్టి సారించాలన్నారు. మెడికల్ కళాశాలల్లో టీచింగ్ స్టాఫ్ పూర్తిగా లేరన్నారు. మెడికల్ కాలేజ్ టీచింగ్ హాస్పిటల్స్‌లో పూర్తి స్థాయిలో సిబ్బందిని నియమించాలని డిమాండ్ చేశారు.

ప్రజా స్వామ్యంలో కట్టడాలు కూలగొట్టడానికి ఓ పద్ధతి ఉంటుందన్నారు. అన్ని రంగాల్లో ఇచ్చిన హామీలపై అతి తక్కువ కాలంలో విఫలమైన ప్రభుత్వం కాంగ్రెస్ అని విమర్శించారు.




హైదరాబాద్: అన్యాక్రాంతమైన ప్రభుత్వ భూములను, చెరువులను పరిరక్షించేందుకు రంగంలోకి దిగిన హైడ్రా.. ఆక్రమణదారుల నుంచి ఇప్పటి వరకు వంద ఎకరాలకుపైగా స్థలాన్ని స్వాధీనం చేసుకున్నట్లు వెల్లడించింది. జీహెచ్ఎంసీ పరిధిలో మొత్తం 23 ప్రాంతాల్లో 262 అక్రమ నిర్మాణాలను కూల్చివేసి 111.72 ఎకరాల భూమిని స్వాధీనం చేసుకున్నట్లు ప్రభుత్వానికి నివేదిక సమర్పించింది.

హైడ్రా గత రెండు నెలలుగా చెరువులు, ఎఫ్‌టీఎల్, బఫర్ జోన్లలో అక్రమ నిర్మాణాలను కూల్చివేస్తోంది. నిబంధనలకు విరుద్ధంగా ఉన్న నిర్మాణాలను ఎక్కడా ఉపేక్షించకుండా నేలమట్టం చేస్తోంది. రామ్‌నగర్ మణెమ్మ గల్లీలో 3, గగన్ పహాడ్ అప్పా చెరువులో 14, అమీన్‌పూర్ పెద్ద చెరువు పరిధిలో 24, మాదాపూర్ సున్నం చెరువులో 42, దుండిగల్ కత్వా చెరువు పరిధిలో 13 అక్రమ నిర్మాణాలను తొలగించినట్లు హైడ్రా వెల్లడించింది. అత్యధికంగా అమీన్‌పూర్‌లో 51 ఎకరాలు, మాదాపూర్ సున్నం చెరువు పరిధిలో 10 ఎకరాల ప్రభుత్వ స్థలాన్ని స్వాధీనం చేసుకున్నట్లు పేర్కొంది. హైడ్రాకు ఐపీఎస్ అధికారి రంగనాథ్ కమిషనర్‌గా వ్యవహరిస్తున్న విషయం తెలిసిందే. దీనికి ప్రత్యేక పోలీసు సిబ్బందిని కేటాయిస్తూ డీజీపీ కార్యాలయం ఇప్పటికే ఉత్తర్వులు జారీ చేసింది. 15 మంది సీఐ స్థాయి, 8 మంది ఎస్ఐ స్థాయి పోలీసు అధికారులు ఆక్రమణల కూల్చివేత కోసం పనిచేయనున్నారు. దీంతో హైడ్రా చర్యలు వేగవంతం కానున్నాయి.

## ఉప ఎన్నికలు వస్తాయని ఆ ఎమ్మెల్యేలు భయపడుతున్నారు..


హైదరాబాద్: తెలంగాణలో ఉప ఎన్నికలు వస్తాయని బీఆర్ఎస్ నుంచి కాంగ్రెస్‌లో చేరిన 10మంది ఎమ్మెల్యేలు వణికిపోతున్నారని బీఆర్ఎస్ ఎమ్మెల్యే పాడి కౌశిక్ రెడ్డి అన్నారు. పూటకో పార్టీ మారే దానం నాగేందర్ బిచ్చగాడు, చీటర్ అంటూ ఆయన సంచలన వ్యాఖ్యలు చేశారు. పార్టీ ఫిరాయించిన ఎమ్మెల్యేలపై తెలంగాణ హైకోర్టు ఇచ్చిన తీర్పును వెంటనే అమలు చేయాలంటూ ఎమ్మెల్యేలు పాడి కౌశిక్ రెడ్డి, కేపీ వివేకానంద ఇవాళ(బుధవారం) అసెంబ్లీ కార్యదర్శి నరసింహాచార్యులను కలిశారు. హైకోర్టు నాలుగు వారాల సమయం ఇచ్చిందని, చర్యలు తీసుకోకుంటే సుమోటోగా కేసు స్వీకరిస్తామని హైకోర్టు చెప్పిన విషయాన్ని నరసింహాచార్యులకు వివరించారు. కాలయాపన చేయకుండా తక్షణమే వారిపై అనర్హత వేటు వేయాలని డిమాండ్ చేశారు. పార్టీ ఫిరాయించిన ఎమ్మెల్యేలపై పాడి కౌశిక్ రెడ్డి నిప్పులు చెరిగారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.." పార్టీ మారిన ఎమ్మెల్యేలకు ఏ మాత్రం సిగ్గు లేదు. వారు వెంటనే రాజీనామా చేయాలి. ఖైరతాబాద్ ఎమ్మెల్యే దానం నాగేందర్ అనేక పార్టీలు మారారు. ఇకపై ఆయన శాశ్వతంగా మాజీ ఎమ్మెల్యేగా మిగిలిపోతారు. కడియం శ్రీహరి పచ్చి మోసగాడు. మాజీ ముఖ్యమంత్రి కేసీఆర్ వద్ద పొద్దున బ్యాగులు తీసుకుని సాయంత్రాని కల్లా కాంగ్రెస్ పార్టీలో చేరారు. స్టేషన్ ఘన్‌పూర్ నియోజకవర్గంలో కడియం శ్రీహరి డిపాజిట్ తెచ్చుకుని చూపించాలి. కాంగ్రెస్‌లో చేరానని శేరిలింగంపల్లి ఎమ్మెల్యే అరికెపూడి గాంధీ స్వయంగా మీడియాకు చెప్పి ఇప్పుడు మాట మారుస్తున్నారు. అరికెపూడి గాంధీ మా పార్టీ సభ్యుడైతే తెలంగాణ భవన్‌కు రావాలి. స్పీకర్ నిర్ణయం దాకా ఆగకుండా ఫిరాయించిన ఎమ్మెల్యేలు రాజీనామా చేసి ఉపఎన్నికలను రావాలి. గతంలో కేసీఆర్ విడిగా కాంగ్రెస్ ఎమ్మెల్యేలను చేర్చుకున్నారని నిరూపిస్తే ఎమ్మెల్యే పదవికి రాజీనామా చేస్తా. గత ప్రభుత్వంలో బీఆర్ఎస్ ఎల్పీలో సీఎల్పీ విలీనం అయ్యింది" అని అన్నారు.




న్యూయార్క్: నేరం చేయకపోయినా పదేళ్ల పాటు జైలు శిక్ష అనుభవించాడో ఓ వ్యక్తి. చివరకు అతడు ఏ తప్పు చేయలేదని తేలడంతో కోర్టు విడుదల చేసింది. అయితే, ఇన్నేళ్ల పాటు అన్యాయంగా ఆయన జీవితం జైలు గోడలకు పరిమితమైనందుకు గానూ ఏకంగా 50 మిలియన్ డాలర్ల నష్టపరిహారం చెల్లించాలని న్యాయస్థానం తాజాగా ఆదేశించింది. అమెరికాలోని చికాగో ఫెడరల్ జ్యూరీ కోర్టు ఈ సంచలన తీర్పు వెలువరించింది.

19ఏళ్ల వ్యక్తిని హత్య చేశాడన్న అభియోగాలపై మార్సెల్ బ్రౌన్ అనే వ్యక్తిని 2008లో పోలీసులు అరెస్టు చేశారు. దీనిపై అప్పట్లో విచారణ జరిపిన న్యాయస్థానం అతడిని దోషిగా నిర్ధారిస్తూ 35 ఏళ్ల జైలు శిక్ష విధించింది. అయితే, అతడితో బలవంతంగా నేరాంగీకారం చేయించారని చెబుతూ 2018లో బ్రౌన్ తరఫున న్యాయవాదులు కోర్టుకు సాక్ష్యాధారాలు సమర్పించారు. దీంతో అతడిపై నమోదైన కేసును న్యాయస్థానం కొట్టేస్తూ బ్రౌన్‌ను విడుదల చేసింది. ఈ క్రమంలోనే తప్పుడు కేసులో తనను జైల్లో పెట్టడాన్ని సవాల్ చేస్తూ బ్రౌన్ న్యాయస్థానాన్ని ఆశ్రయించారు. దీనిపై విచారణ జరిపిన చికాగో ఫెడరల్ కోర్టు తాజాగా కీలక ఉత్తర్వులు జారీ చేసింది. "తప్పుడు కేసులో బ్రౌన్‌ను అరెస్టు చేసినందుకు గానూ 10 మిలియన్ డాలర్లు, పదేళ్ల పాటు జైలు శిక్ష అనుభవించేలా చేసినందుకు గానూ మరో 40 మిలియన్ డాలర్లు అతడికి చెల్లించాలి" అని ఆదేశించింది.

అంటే మొత్తంగా 50 మిలియన్ డాలర్లు (భారత కరెన్సీలో దాదాపు రూ.419కోట్లకు పైమాటే) పరిహారం ఇప్పించింది. కోర్టు తీర్పుపై బ్రౌన్ హర్షం వ్యక్తంచేశారు. ఇన్నాళ్లకు తనకు, తన కుటుంబానికి న్యాయం జరిగిందని అన్నారు.




## వరద బాధితులకు తెలంగాణ పోలీసుల రూ.11కోట్ల విరాళం

**హైదరాబాద్: తెలంగాణలో వరద బాధితుల సహాయార్థం పోలీసులు ఒకరోజు జీతాన్ని విరాళంగా అందజేశారు. మొత్తం రూ.11.06 కోట్లు ఇచ్చారు. దీనికి సంబంధించిన చెక్కును సీఎం రేవంత్‌రెడ్డికి డీజీపీ జితేందర్ అందజేశారు. తెలంగాణ పోలీసు అకాడమీలో పాసింగ్ అవుట్ పరేడ్‌కు హాజరైన సీఎంకు డీజీపీ చెక్కు అందించారు.**

## దేశ ప్రజలను అవమానించేలా అమెరికాలో రాహుల్ వ్యాఖ్యలు




హైదరాబాద్, సెప్టెంబర్ 11: కాంగ్రెస్ అగ్రనేత రాహుల్ గాంధీ ఎన్నికల హ్యాంగోవర్ నుంచి బయటపడ్డట్టు లేదని బీజేపీ ఎంపీ లక్ష్మణ్ వ్యాఖ్యలు చేశారు. బుధవారం మీడియాతో మాట్లాడుతూ.. రాహుల్ అమెరికా పర్యటనలో దేశం, ప్రజాస్వామ్యం పట్ల భారత దేశ ప్రజలను అవమానించేలా వ్యాఖ్యలు చేస్తున్నారని మండిపడ్డారు. మోదీ, బీజేపీ వల్ల ప్రధాని కాలేదనే అక్కసుతో దేశం మీద విషం చిమ్ముతున్నారన్నారు. కాంగ్రెస్ ఓడిపోయినంత మాత్రాన ప్రజాస్వామ్యం లేదని ఇంగిత జ్ఞానం లేకుండా మాట్లాడారని ఆగ్రహం వ్యక్తం చేశారు. బీజేపీ రిజర్వేషన్లు రద్దు చేస్తుందని ఫేక్ వీడియోలు సృష్టించి లోక్‌సభ ఎన్నికల్లో కాంగ్రెస్ లబ్ధి పొందిందన్నారు. రిజర్వేషన్ల రద్దుకు రాహుల్ గాంధీ తెరలేపుతున్నారన్నారు. రాజ్యాంగం ద్వారా రిజర్వేషన్లు కల్పించిన అంబేద్కర్‌ను ఓడించిన చరిత్ర కాంగ్రెస్ ది అని అన్నారు. ప్రతిపక్ష నాయకుడు హోదాలో సమయం అనుకూలించినప్పుడు రద్దు చేస్తామని రాహుల్ గాంధీ చెప్పారన్నారు. నరేంద్ర మోడీ నాయకత్వం నచ్చే బీజేపీలో చేరుతున్నారని తెలిపారు. భారతదేశాన్ని వ్యతిరేకించే శక్తులతో రాహుల్ గాంధీ సమావేశం అవుతున్నారన్నారు. రాహుల్ గాంధీ చర్యలను తీవ్రంగా ఖండిస్తున్నామన్నారు. సిక్కుల ఊచకోతకు కారణమైంది కాంగ్రెస్ పార్టీ అని.. సిక్కుల హక్కుల కోసం రాహుల్ గాంధీ మాట్లాడటం విడ్డూరంగా ఉందని ఎంపీ లక్ష్మణ్ తీవ్ర స్థాయిలో విరుచుకుపడ్డారు. అలాగే కాంగ్రెస్ అగ్రనేత రాహుల్ గాంధీపై కేంద్రమంత్రి బండి సంజయ్ కూడా విరుచుకుపడ్డారు. రాహుల్.... క్విట్ ఇండియా అంటూ వ్యాఖ్యలు చేశారు. విదేశాలకు వెళ్లి భారత ఎన్నికల వ్యవస్థను విమర్శిస్తావా? అంటూ మండిపడ్డారు. రిజర్వేషన్లపై నోటికొచ్చినట్లు మాట్లాడతావా అంటూ బండి సంజయ్ ఆగ్రహం వ్యక్తం చేశారు.

## అంకుశం సినిమాలో రామిరెడ్డికి పట్టిన గతే కేసీఆర్‌కు పట్టేది..



హైదరాబాద్, సెప్టెంబర్ 11: మాజీ ముఖ్యమంత్రి, బీఆర్ఎస్ అధినేత కేసీఆర్‌పై కేంద్ర మంత్రి బండి సంజయ్ తీవ్ర స్థాయిలో విరుచుకుపడ్డారు. బుధవారం మీడియాతో మాట్లాడుతూ.. కేసీఆర్ కుటుంబాన్ని జైల్లో వేయడం సీఎం రేవంత్ రెడ్డికి సాధ్యం కావడం లేదన్నారు. కేసీఆర్ ఢిల్లీ వెళ్లి కాంగ్రెస్ పెద్దలతో మాట్లాడుకుని వచ్చారన్నారు. బీజేపీ అధికారంలోకి వస్తే కేసీఆర్ అంతు చూసేటోళ్లమని అన్నారు. అంకుశం సినిమాలో రామిరెడ్డికి పట్టిన గతే కేసీఆర్ కుటుంబానికి పట్టేదన్నారు. కేసీఆరే దశమ గ్రహం... నవగ్రహాలు చేయడం విడ్డూరంగా ఉందన్నారు. వరదలతో జనం అల్లాడుతుంటే కేసీఆర్ ఎందుకు బయటకు రావడం లేదని ప్రశ్నించారు. ప్రజలు కేసీఆర్‌కు 'నో ఎంట్రీ బోర్డు' పెట్టేశారని... ఇగ రీ ఎంట్రీ కలే అంటూ విమర్శలు గుప్పించారు. ఆరు గ్యారంటీలపై డైవర్ట్ చేసేందుకే హైడ్రా పేరుతో 'హైడ్రామా'లాడుతున్నరని మండిపడ్డారు. "దేశ ప్రజలారా... కాంగ్రెస్ ముక్త్ భారత్ లక్ష్యంగా ముందుకు సాగండి" అంటూ పిలుపునిచ్చారు. అత్యధిక సభ్యత్వం నమోదు చేసిన డివిజన్ కార్యకర్తలను తాను సన్మానిస్తానని... ఈసారి జీహెచ్ఎంసీ మేయర్ బీజేపీదే అంటూ ధీమా వ్యక్తం చేశారు. జీహెచ్ఎంసీ ఎన్నికల్లో కాంగ్రెస్, బీఆర్ఎస్, ఎంఐఎం కలిసి పోటీ చేయడం తథ్యమన్నారు. లౌకికవాదులారా.... జైనూర్ ఘటనపై నోరెందుకు మెదపడం లేదని ప్రశ్నించారు. హిందూ పండుగలపై ఆంక్షలు పెడుతుంటే ఎందుకు స్పందించరని అడిగారు. జరుగుతున్న అన్యాయంపై ప్రశ్నించని వాళ్లు తన దృష్టిలో భారతీయులే కాదన్నారు. అలాగే కాంగ్రెస్ అగ్రనేత రాహుల్ గాంధీపై కూడా కేంద్రమంత్రి విరుచుకుపడ్డారు. రాహుల్.... క్విట్ ఇండియా అంటూ వ్యాఖ్యలు చేశారు. విదేశాలకు వెళ్లి భారత ఎన్నికల వ్యవస్థను విమర్శిస్తావా? అంటూ మండిపడ్డారు. రిజర్వేషన్లపై నోటికొచ్చినట్లు మాట్లాడతావా అంటూ బండి సంజయ్ ఆగ్రహం వ్యక్తం చేశారు.

## బర్త్‌డే పార్టీలో గంజాయి.. ఎస్‌వోటీ పోలీసుల మెరుపుదాడి



హైదరాబాద్, సెప్టెంబర్ 11: గచ్చిబౌలి పోలీస్ స్టేషన్ పరిధిలో రెవ్ పార్టీని ఎస్ఓటి పోలీసులు భగ్నం చేశారు. వారి నుంచి గంజాయి పాకెట్స్, ఈ సిగిరెట్స్, మద్యాన్ని స్వాధీనం చేసుకున్నారు. పట్టుబడ్డ వారిని గచ్చిబౌలి పోలీసులకు మాదాపూర్ ఎస్ఓటీ పోలీసులు అప్పగించారు. కేసు నమోదు చేసిన పోలీసులు దర్యాప్తు చేపట్టారు. గచ్చిబౌలి పోలీస్ స్టేషన్ పరిధిలోని టీఎన్జీఎస్ కాలనీలో బర్త్‌డే పార్టీలో గంజాయిని విక్రయిస్తున్నట్లు సమాచారం అందుకున్న మాదాపూర్ ఎస్ఓటీ పోలీసులు మెరుపుదాడి చేసి పలువురిని అదుపులోకి తీసుకున్నారు. బర్త్డే పార్టీలో గంజాయిని విక్రయిస్తున్న 18 మందిని మాదాపూర్ ఎస్‌వోటీ, గచ్చిబౌలి పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. 18 మంది యువతీ యువకులు టీఎన్జీఎస్ కాలనీలోని ఓ అపార్ట్మెంట్లో బర్త్‌డే పార్టీని నిర్వహిస్తున్నారు. బర్త్డే పార్టీలో 12 మంది అబ్బాయిలు, 6 గురు యువతులను పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. పక్కా సమాచారంతో ఎస్‌వోటీ పోలీసులు మెరుపు దాడి చేశారు. వారి వద్ద నుంచి 45 గ్రాముల గంజాయి, మద్యం బాటిళ్లను స్వాధీనం చేసుకున్నారు. ఎన్డీపీఎ ఆక్ట్ కింద పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేపట్టారు. 18 మందికి 41ఏ కింద నోటీసులు ఇస్తామని గచ్చిబౌలి పోలీసులు తెలిపారు.

Printed, Published and owned by VISHWANATH V, Printed at S A Printers D No 3 92 Shed No 2, Sy No 45 and 49, Sadashiv Nagar Narapally Village, Ghatkesar Mandal, Medchal - Malkajgiri District, Telangana - 501301. and Published from D.No. 5-87, Near Gandhi Statue, Aliyabad, Shamirpet (M) - 500 078, Medchal-Malkajgiri District, Telangana State.
Editor : VISHWANATH V, RNI Regd. No. TELTEL/2023/86207, Phone No. 8977598262, Email Id : reportervishwanath@gmail.com